గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సెప్టెంబర్2013

# కథలు




"ఏమిటి ధరణి నువ్వు చెప్పేది. నీకేమైనా బుద్ధుందా? నలుగురికీ తెలిస్తే నవ్విపోతారు. దానితో పోతుందా ఏమిటి. తెల్లారిలేస్తే వీధిలో తిరగగలమా? నలుగురికి మొహం చూపించుకోగలమా. ఏదో నీ కర్మ కాలి నీ మొగుడు ఆ ఏక్సిడెంట్ లో పోపోతే నీకీ ఖర్మ పట్టేది కాదు కదా. పూర్తిగా నాలుగు సంవత్సరాలు కూడా నిండని కూతురు, దానికి ఇప్పుడిప్పుడే జ్ఞానం వస్తోందని చెప్పాలి. ఈ విషయం తెలిస్తే దాని చిన్న గుండెలో ఎన్ని అలజడులు మొదలవుతాయో ఏమైనా గ్రహించావా. అంతగా ఆగలేకపోతే ఎవడ్నో ఒకడ్ని తెచ్చి ముడిపెట్టేవాళ్ళం కదా! ఇదేం పని, ఇదేం చోద్యం." ఆపకుండా భానుమతి తిట్టిపోస్తోంది కూతుర్ని.

కళ్ళనించి కారుతున్న నీరు తప్ప ఒక్కముక్క కూడా రావడం లేదు ధరణి నోటినుంచి.

*****

గదిలో మంచం మీద పడివున్న తండ్రికి మందులందిస్తోంది ధరణి. 'ఏంటమ్మా... అలా వున్నావ్?' అన్నట్టు చూసాడు. నోట మాట రాలేదు ధరణికి. పుట్టెడు దుఖాన్ని గొంతులోనే మింగేసింది. ఇంతలో బయటనుంచి వచ్చిన తల్లి విసురుగా కూతురు చేతిలోని మందుసీసాని లాక్కుంది.

"నీ నిర్వాకం చూస్తూ వూరుకోలేం. ఈ వయస్సులో ఈ క్షోభని తట్టుకొనే శక్తి నాకు లేదు. వీలైతే కడుపు తీయించుకో, లేకపోతే తక్షణమే ఇల్లు ఖాళీ చేసి వేరే ఎక్కడైనా వుండి నీ పాట్లు నువ్వు పడు." తీవ్రంగా చెప్పింది తల్లి.

అక్కడ వుండాలనిపించలేదు ధరణికి. భారం గా అడుగులు వేసుకుంటూ బయటికి నడుచుకుంటూ వెళ్ళింది.

తన చిన్ననాటి స్నేహితురాలు దమయంతికి ఫోన్ చేసింది. జరిగిన విషయాన్నంతా దాచకుండా చెప్పింది. దమయంతికి ఒకింత మనసులో ఆందోళన గానే వున్నప్పటికీ స్నేహితురాలి పరిస్థితిని అర్థం చేసుకుంది. తన స్నేహ హస్తాన్ని అందించడానికి ముందుకు వచ్చింది.

తన భర్తని ఒప్పించి తన ఇంటిలోని మేడమీద గది ఒకటి ఖాళీ చేసి అక్కడ వుండే ఏర్పాటు చేసింది.

భానుమతికి ఇదంతా పెద్ద వేదన గా తయారయింది. కానీ చేసేదేం లేక సరిపెట్టుకుంది.

తరచూ ఆసుపత్రికి వెళుతూ చెకప్ లు చేయించుకుంటూ తన ఆరోగ్యాన్ని, కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటొంది ధరణి. తనకి కావలసిన అన్ని ఏర్పాట్లు అందేలా చూస్తున్నారు అక్కడి వైద్యులు.

ఇలా వుండగా, ఒకరోజు దమయంతి ధరణి ని అడిగింది. "ఈ విషయాలన్నీ మీ వాళ్ళకి చెప్పొచ్చు కదా, ఎందుకు అసలు విషయాన్ని దాచి దోషిలా బతకటం" అంది.

"చెప్పొచ్చు కానీ చెబితే ఒప్పుకొనే అంత విశాల హృదయం వాళ్ల దగ్గర వుందని నేను అనుకోవటం లేదు. మా నాన్నగారికి విధి వైపరీత్యం వల్ల పక్షవాతం వచ్చి కాలు, చేయి పని చేయకపోవటం తో పాటు నోటిమాట కూడా పడిపోయింది. ఒక్కసారిగా మా జీవితాలు వీధిన పడ్డాయి. అసలే అంతంతమాత్రం బతుకులు. దిగువ మధ్య తరగతి కుటుంబం. నాన్నది చాలీ చాలని జీతంతో పనిచేసే ప్రైవేటు ఉద్యోగం. సింపుల్ గా చెప్పాలంటే రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు. ఊహించని ఉపద్రవానికి ఉప్పెన తోడయినట్టు మా నెత్తిన పిడుగు పడ్డట్టయింది. అప్పటికే భర్తని కోల్పోయి వాళ్ల నెత్తిన కుంపటిలా మారిన నాకు అసహాయమైన పరిస్థితిలో వున్న తండ్రిని చూసి నిస్సహాయ స్థితిలో కూరుకుపోయాను. ఓ పక్క సరైన చదువులేక, చేయడానికి పనిలేక

తిరుగుతున్న తమ్ముడు. ఈ పరిస్థితులన్నిటిని తట్టుకోలేక తనువు చాలిద్దామనుకున్నాను. నిద్రమాత్రలు మింగాను. కానీ నాకు చావు దూరమయ్యిందో లేక నేనే చావుకు దూరమయ్యానో మొత్తానికి ఇలా బతికాను. భగవంతుడు నాకు ఈ విధం గా సహాయపడే అవకాశాన్ని కల్పించడం కోసమే నన్ను బతికించాడులా వుంది.

ఆ ఆసుపత్రిలోని రమ అనే డాక్టర్ నా పరిస్థితిని పూర్తిగా అర్ధం చేసుకుంది. నీకు మనస్ఫూర్తిగా సహాయం చేస్తానని ఆత్మీయంగా చెప్పింది. నువ్వు చేసే పని ద్వారా రెండు కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని పూర్తిగా వివరించింది. నేనున్న పరిస్థితిలో నాకు కూడా ఇది అనివార్యం లా అనిపించింది. సరోగసీ ద్వారా నువ్వు ఒక బిడ్డకు జన్మనివ్వాలని అలా ఇవ్వడం ద్వారా సంతానం లేని ఆ దంపతులు ఎంతో ఆనందాన్ని పొందుతారని చెప్పింది. వాళ్ళిచ్చే ఆర్ధికసహాయం ద్వారా నా కుటుంబం కష్టాల కడలినుండి గట్టెకుతుందని అనిపించింది. నాకు ఇంతకు మించి మరో తోవ కనపడలేదు.

ఈ విషయాన్ని నోట మాట పలకలేని స్థితిలో వున్న నా తండ్రికి వివరించలేను. కడుపులో పెట్టుకోవలసిన తల్లి నన్ను అర్ధం చేసుకోవడానికి నాకు జన్మనిచ్చిన తల్లి కాదు. అమ్మ లాంటి పిన్ని. ఇటువంటి స్థితిలో వున్న నేను నా కుటుంబం కోసం చేసింది తప్పా..." అంది.

"ధరణి... నువ్వు నిజంగా సార్ధక నామధేయురాలివి. స్త్రీ లోకానికే మణిపూస లాంటి దానివి." అంటూ ధరణి తలమీద మృదువుగా నిమిరింది దమయంతి.



ఇంకా కొంత మంది నాటక ప్రియులు, పోషకులు ప్రతీ సంవత్సరం నాటక పోటీలు, పరిషత్తులు జరుపుతూ వుండటంతో నాటక కళ ఇంకా కొన వూపిరితో కొట్టుకుంటోంది.

నారాయణరావు కి నాటకాల పిచ్చి, ఆ పిచ్చితోనే నా.నా. సమాజాన్ని స్థాపించాడు. నానా అంటే నారాయణరావు నాటక సమాజం. ఆ సమాజం పేరుతో నాటకాలు ప్రదర్శించే వాడు. టి.వి. ఫ్లేవర్ వల్ల నాటకాల పవర్ తగ్గింది. దీంతో నా.నా. సమాజం నాటకాలు వెయ్యాలంటే నానా తిప్పలు పడేది. కాని నారాయణరావు నాటకాలు మానలేక తను సృష్టించిన సమాజాన్ని తనే చంపుకోలేక ఆత్మాభిమానాన్ని చంపుకుని ఎలాగో అలాగ చిన్న చిన్న నాటికలు ప్రదర్శిస్తూనే వున్నాడు. ఇక్కడ ఆత్మాభిమానాన్ని చంపుకోవటం అంటే కళాకారులు కనిపిస్తే నాటకం వేస్తారా అని అడుక్కోవటమే. దానికి కారణం ఏమిటంటే నటన రాక పోయినా, బాష పలకడం, భావం పలికించడం రాకపోయినా నటుడిగా చలామణీ చేసే కళారంగం ఒకటుంది. అదే టి.వి.సీరియల్స్ రంగం. దాంతో అందరూ నాటక రంగాన్ని వదిలి ఆ రంగం వైపు దూకుతున్నారు. దీనికీ ఓ చిన్న కారణం వుంది. ఆ రంగంలో కళాకారులకు హార్దిక మరియు ఆర్ధిక లాభం దొరకటమే. దాంతో నాటకాలు కుంటుపడ్డాయి.

నా.నా. సమాజంలో నారాయణరావు తో పాటే వున్న ఫౌండర్ మెంబర్ గోవిందరావు టి.వి రంగంలో ఓ చిన్న రచయితగా, నటుడిగా స్థిర పడ్డాడు. ఎన్నో సార్లు నారాయణరావు ని ఈ రంగంలోకి దూకమని అడిగాడు.

“నాటక రంగం అన్నింటికీ మాతృ సంస్థ. దాన్ని వదలటం నాకిష్టం లేదు." అన్నాడు నారాయణరావు. “నిన్ను వదలమనలేదు, కాకపోతే దీనిని కూడా రుచి చూడు" అన్నాడు గోవిందరావు.

దాంతో నారాయణరావుకు అందులో వున్న ఆనందం తెలుసు కుందామని ప్రయత్నించాడు. కానీ అందులో నారాయణరావుకి ఆనందం దక్కక పోగా అతనిలో వున్న కళాకారుడికి అవమానం జరిగింది.

ఓ రోజు రవీంద్రభారతిలో తన సమాజం తరపున ప్రదర్శిస్తున్న నాటకానికి వెళుతూ అద్దం ముందు నిలబడి తల దువ్వుకుని పక్కనే వున్న డైరీని తీసుకున్నాడు. అందులోనుంచి ఐదు వందల నోటు కింద పడింది. నారాయణరావు ఆ నోటుని తీసుకుని అద్దం ముందు పెట్టి చూసాడు.

సరిగ్గా పది రోజుల క్రితం ఏం జరిగిందో అద్దంలో అతనికి గతం కనిపించింది. అది ఏంటంటే...?

ఆ రోజు ఓ ఫోను వచ్చింది. ఫోను తీసి ‘హలో’ అన్నాడు.

‘నారాయణరావు గారా’

‘అవునండీ... నారాయణరావు నే మాట్లాడుతున్నా’

‘నమస్తే సార్’

‘నమస్తే... చెప్పండి.’

‘సార్ నేను జంబలకిడి పంబ బేనర్ నుంచి మేనేజర్ని మాట్లాడుతున్న.’

‘జంబలకిడి పంబ బేనరా’

‘జిళ్ళ పాకం... సీరియల్... ఆ... అవునండి.’

‘రేపు మీకు షూటింగు వుంది. అందులో మీరు తండ్రి పాత్ర చెయ్యాలి. మీ గురించి గోవిందరావు గారు చెప్పారు.’

నారాయణరావుకి ఆనందం ఆశ్చర్యం కలిగాయి.

‘మీ పేరు’ నారాయణరావు అడిగాడు

‘నాపేరు చంద్రం. మేనేజర్ని’ అన్నాడు చంద్రం

‘మీరెక్కడ వుంటారు’

‘వనస్థలి పురంలో’

‘షూటింగు పటాన్చెరు దగ్గర’

‘పటాన్చేరువా’

‘అవునండి. పటాన్చెరువు బస్టాండ్ దగ్గిరికి వచ్చి ఫోన్ చెయ్యండి. రేపు ఆరు గంటలకల్లా రావాలి. మీది కంటిన్యుటీ కారక్టర్. తండ్రి పాత్రలో మీకు రేపు మూడు సీనులు వుంటాయి. మొదటి సీనులో మీరు జమిందారు. అంటే కోటు, ఫాంటు, బ్లాక్ షూస్, టై తెచ్చుకోవాలి. అలాగే రెండో సీనులో మామూలు మిడిల్ క్లాసు తండ్రి. అంటే మామూలు ఫాంటు, షర్టు, మంచివి డార్క్ కలర్ వి రెండు జతలు తెచ్చుకొండి. అలాగే మూడో సీనులో చితికిపోయిన పేద తండ్రి. చిరిగి పోయిన బనీను, తెల్ల పంచె, తువ్వాలు. డార్క్ కలర్ వి రెండు జతలు తెచ్చుకొండి. ఎందుకయినా మంచిది అలాగే చిరగనివి కూడా రెండు జతలు తెచ్చుకోండి. రేపు అరుగంటలకల్లా లోకేషన్ లో వుండాలి. వుంటా సార్.' అంటూ ఫోన్ కట్ చేసాడు.

నారాయణరావు కనిపించిన అందరికీ తనకి టి.వి సీరియల్ లో నటిస్తున్నానంటూ అందరికీ చెప్పాడు. కాని సూటు, టై లేకపోవటం తో పక్కనే వున్న సుబ్బారావుని అడిగాడు. సుబ్బారావు దగ్గర టై ఒక్కటే వుండటం తో అందరి దగ్గరా తలొకటి ముష్టి తెచ్చుకుని డ్రెస్ సమకూర్చుకున్నాడు. చంద్రం చెప్పినట్టు అన్నీ వున్నాయా లేదా అని చూసుకుని రాత్రే బాగ్ లో సర్దుకున్నాడు.

గదిలో తలుపు వేసుకుని అద్దం ముందు నిలబడి తండ్రి పాత్ర. అందులో మూడు సీనులు. జమిందారు తండ్రి , మామూలు తండ్రి, చితికిపోయిన తండ్రి. డైలాగులు ఎలా వుంటాయో తెలిదే... ఎలా... ఆ ఎలా వుంటేనే పాత్రలో జీవించాలి. అంటూ అద్దం ముందు అన్ని పాత్రల్లో నటించడం మొదలుపెట్టాడు. జమిందారుగా హుందాగా, మామూలు తండ్రి గా సగటు మనిషిగా, చితికిపోయిన తండ్రి గా దీనంగా ఆహ బావాలను అద్భుతంగా నటించి, రేపు కెమేరా ముందు ఇరగదీయాలి అనుకున్నాడు. రేపు ఉదయం ఆరు గంటలకి పటాన్చెరు బస్టాండ్ లో వుండాలంటే ఇంటి దగ్గరినుంచి కనీసం నాలుగు గంటలకయినా బయలు దేరాలి. అంటే నేను మూడు గంటలకి లేచి తయారుకావాలి అనుకుంటూ రెండున్నరకి అల్లారం పెట్టుకుని పడుకున్నాడు.

టి.వి.లో నటిస్తున్నానన్న ఆనందంతో నారాయణ రావుకి నిద్ర పట్టలేదు. అరగంటకోసారి అలారం మోగలేదేంటి అనుకుంటూ లేచి చూసుకుంటూ రెండు గంటలకే లేచి తెమిలాడు. ఆ రోజు ఇంట్లో అందరికీ జాగారమే అయ్యింది. మూడు గంటలకే నారాయణ రావు మోటారు సైకిల్ మీద పటాన్చెరు బయలుదేరాడు. హమ్మయ్య వెళ్ళాడురా బాబూ అనుకుంటూ అందరు హాయిగా పడుకుని ఉదయం తొమ్మిది గంటలకి లేచారు.

ఆరు గంటలకల్లా నారాయణ రావు పటాన్చెరు బస్టాండ్ చేరి ఇరవయ్ - ముప్పై సార్లు ఫోన్ చేసి మొత్తానికి లొకేషన్ చేరుకున్నాడు.

నారాయణరావు లొకేషన్ కి వెళ్ళేసరికి ఎవ్వరూ లేరు. లొకేషన్ ఇదేనా కాదా… తప్పుగా వచ్చానా అనుకుంటూ కంగారు పడ్డాడు. టైం ఏడు అయ్యింది. మెల్లిగా ప్రొడక్షన్ వేన్ వచ్చింది. ఇంకో అరగంటకి రెండు కార్లు, రెండు వేన్ లు వచ్చాయి. కెమెరా సామానులు, లైట్లు, రిఫ్లెక్టర్ బోర్డులు దిగాయి. నారాయణ రావు కంగారు తగ్గింది. చంద్రం ఎవరో తెలీక ఇద్దరు, ముగ్గుర్ని అడిగి చంద్రాన్ని కనుక్కుని 'సార్… నేనే నారాయణరావుని' అంటూ పరిచయం చేసుకున్నాడు.

'అలాగా… కూర్చోండి…' అంటూ పట్టించుకోకుండా వెళ్లి పోయాడు.

నారాయణ రావు కి ఏం చెయ్యాలో తెలిలేదు. అంతా కొత్త. కొత్తవాళ్ళు, కొత్త వాతావరణం. కొత్త ఫీలయ్యి అక్కడే వున్న కుర్చీలో కూర్చున్నాడు. ఇంతలో ప్రొడక్షన్ బాయ్ ఫ్లాస్క్ లో టీ తెచ్చి ప్లాస్టిక్ గ్లాసులో పోసి ఇచ్చాడు. నారాయణరావు తీసుకుని తాగాడు.

ఇంతలో చంద్రం ఓ వ్యక్తి తో వచ్చాడు.

'ఈయనకి తండ్రి పాత్ర మేకప్ చెయ్యండి. నారాయణరావు గారు వెళ్ళండి. అవును డ్రెస్సు చెప్పినవన్నీ తెచ్చారా' అన్నాడు చంద్రం.

'తెచ్చాను సార్ చూస్తారా' అంటూ ఆత్రంగా అడిగాడు.

‘వద్దులెండి. తర్వాత చూద్దాం’ అంటూ వెళ్ళిపోయాడు చంద్రం.

నారాయణరావు ఫిలయ్యి మేకప్ కోసం ఆ వ్యక్తి వెనకాలే వెళ్లాడు.

నారాయణరావు కి మేకప్ వేస్తున్నాడు. ఆ వ్యక్తి.

‘జమిదారు తండ్రి. మధ్య తరగతి తండ్రి, పేద తండ్రి అన్నారు. ఏ పాత్ర కి మేకప్.’ అంటూ అడిగాడు నారాయణరావు.

‘తండ్రి పాత్ర కి వేస్తాను. ఏది కావాలంటే అప్పుడు టచ్ అప్ చేద్దాం.’ అంటూ వేసాడు.

టైం తొమ్మిదయింది.

నారాయణ రావు మేకప్ వేసుకుని కూర్చున్నాడు.

అసిస్టెంట్ డైరెక్టర్. డైరెక్టర్ కి సీను పేపరు చూపిస్తున్నాడు.

ప్రొడక్షన్ వాళ్ళు టేబుల్స్ వేసి అందరికీ టిఫిన్ ఎరేంజ్ చేసారు. అందరూ టేబుల్స్ దగ్గర కూర్చున్నారు.

ప్రొడక్షన్ చీఫ్ వాళ్లకి టిఫిన్స్ పెట్టాడు.

దూరంగా ఇంకో టేబుల్ మీద మిగిలిన వాళ్లకి టిఫిన్స్ ఎరేంజ్ చేసారు.

చంద్రం వచ్చి ‘రావుగారు టిఫిన్ చెయ్యండి' అని చెప్పి వెళ్లి పోయాడు.

నారాయణరావు అందరితో టిఫిన్ చేసి మళ్ళీ వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు. పలకరిద్దామంటే ఎవరూ తెలిసిన వాళ్ళు లేరు. మిగిలిన వాళ్ళు ఎవరూ తనన్ని చూసీ చూడనట్టు చూస్తున్నారు.

ఇద్దరు ముగ్గురుని పలకరించినా వాళ్ళు కూడా ఏదో పలికీ పలకనట్టు మాట్లాడారు.

నారాయణరావు గోవిందరావు కోసం ఎంక్వయిరీ చేసాడు. గోవిందరావు గారు ఇవ్వాళ రారు. అంటూ ఓ వ్యక్తి చెప్పాడు.

మళ్ళీ ప్రొడక్షన్ బాయ్ ప్లాస్టిక్ గ్లాసులో టీ తెచ్చి ఇచ్చాడు. ఇంకో ప్రొడక్షన్ బాయ్ ఓ ట్రే లో పింగాణీ కప్పులతో టీ ని డైరెక్టర్, కెమెరామెన్, హీరో జానకిరాం లకి ఇస్తున్నాడు. నారాయణ రావు తన చేతిలో ప్లాస్టిక్ కప్పు వంక చూసుకొన్నాడు.

ఓ అరగంటలో షూటింగు మొదలయింది. డైరెక్టర్ మానిటర్ లో చూస్తున్నాడు. హీరో యాక్షన్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్ ప్రామ్టింగు చేస్తున్నాడు. 'అమ్మా... నాకు ఉద్యోగం వచ్చింది. వెంటనే చేరాలి.' అది విని హీరో జానకిరాం అదే డైలాగు చెబుతున్నాడు. మూడు టేకుల్లో ఓ.కే. అయ్యింది. అందరూ చప్పట్లు కొట్టారు.

నారాయణ రావు ఈచిన్న డైలాగు కి ప్రామ్టింగు కావాలా. అనుకున్నాడు.

కాసేపు చూసి నా డైలాగులు ఎలా వుంటాయో అనుకుంటూ అసిస్టెంట్ డైరెక్టర్ ని సీను పేపర్ అడిగాడు.

'అవన్నీ మీకెందుకు ఇపుడు. మీ టైం వచ్చినపుడు ఇస్తాం. మీరు వెళ్ళి రిలాక్స్ అవ్వండి.' అన్నాడు.

'ఏం లేదు కొంచెం ప్రాక్టీసు చేసుకుందామని.'

'ఏం అవసరం లేదు. మేం చెబుతాం. మీరు చెప్పండి.' అంటూ వెళ్ళిపోయాడు అసిస్టెంట్ డైరెక్టర్

నారాయణరావుకి ఏం అర్థంకాలేదు. మౌనంగా కూర్చున్నాడు.

టైం పన్నెండు అయ్యింది. నారాయణరావు షూటింగు ఎలా జరుగుతుందో అంతా చూస్తున్నాడు.

ఒంటి గంట అయ్యింది. డైరెక్టర్ బ్రేక్ చెప్పాడు.

‘నారాయణరావు గారు లంచ్ చెయ్యండి' అంటూ చెప్పి వెళ్లిపోయాడు చంద్రం.

లంచ్ ఎక్కడా అని చూసాడు. ఓ చోట టేబుల్స్ వాటిమీద భోజనానికి అన్నీ సర్దివున్నాయి. నారాయణరావు వెళ్లి కూర్చున్నాడు. మీకు ఇక్కడ కాదు లెండి అంటూ చెప్పాడు. ఓ ప్రొడక్షన్ బాయ్. నారాయణరావు లేచి వెళ్లాడు. ఇంకో చోట పెద్ద టేబుల్స్ కుర్చీలు వేసి వున్నాయి. అక్కడికి వెళ్లి కూర్చున్నాడు. ‘సార్ మీకు ఇక్కడ కాదు అక్కడ అంటూ చూపించాడు. నారాయణరావు చూసాడు. అక్కడ అందరికీ ప్లేట్లు చేతికి ఇస్తున్నారు. నారాయణరావుకి కూడా ఆ ఓ ప్లేటు ఇచ్చాడు. అక్కడ వున్న మోడాల మీద కూర్చున్నాడు నారాయణరావు. లైటు బాయ్స్, అసిస్టెంటులు, జూనియర్ ఆర్టిస్టులు అందరూ కూర్చుని వున్నారు. నారాయణరావు వారితో పాటూ కూర్చుని ఎలో అలా లంచ్ కానిచ్చి అయింది అనిపించాడు. మళ్ళీ షూటింగు మొదలయింది. ఇంకా నారాయణరావు కి పిలుపు రాలేదు. చిరాగ్గా ఫీల్ అయ్యాడు.

ఇంతలో చంద్రం వచ్చి 'ఓసారి టచప్ చేయించుకోండి' అన్నాడు.

‘నా కారెక్టర్ ఎప్పుడు వస్తుంది’ అంటూ అడిగాడు నారాయణరావు.

‘వస్తుంది ముందు మీరు టచప్ చేయించుకోండి’. అంటూ వెళ్లాడు.

నారాయణరావు హేపీ గా తన సీను వస్తోందని వెళ్లి మళ్ళీ టచప్ చేయించుకున్నాడు.

గడియారం ఐదు అయ్యింది.

'ఏడయ్యా తండ్రి పాత్ర వేసే ఆయన? ఎక్కడ?' అంటూ డైరెక్టర్ అరిచాడు.

నారాయణరావుకి మండుటెండ లో వాన కురిసినట్టు అనిపించింది.

'నేనేసార్' అంటూ వెళ్లాడు.

డైరెక్టర్ చూసి ఓకే అన్నాడు. అసిస్టెంటు డైరెక్టర్ ని పిలిచి 'డ్రెస్ ఏంటి' అంటూ అడిగాడు.

'పేద తండ్రి సీను సార్' అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

'అయితే చిరిగిపోయిన పంచె, బనీను, తువ్వాలు వెయ్యండి' అన్నాడు డైరెక్టర్.

'నేను తెచ్చుకున్నా. నాదగ్గర రడీగా వుంది సార్' అన్నాడు నారాయణరావ్.

'అలా అయితే వేసుకుని రండి' అన్నాడు డైరెక్టర్.

'త్వరగా వెళ్లి వేసుకురండి. లేటవుతోంది.' అంటూ కసిరాడు అసిస్టంట్ డైరెక్టర్.

'లేటవుతోందా... ఉదయం ఆరింటికి వచ్చాను సార్' అన్నాడు నారాయణరావు.

'సరేలెండి... త్వరగా రండి' అన్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్.

'మొదటి సీను పేద తండ్రి. సెంటిమెంటు సీను. ఆదరగొడతా' అనుకుంటూ డ్రెస్ వేసుకుని వచ్చాడు.

డైరెక్టర్ చూసి 'బాగుంది' అన్నాడు.

'సార్. సీను పేపర్ ఇస్తారా' అడిగాడు నారాయణరావు.

'ఎందుకు మేం చెబుతాం. మీరు విని చెప్పెయ్యండి' అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

నారాయణరావు కి అర్ధం కాలేదు. 'ఓసారి మాటర్ పూర్తిగా చూడనీయండి' అంటూ పేపర్సు చూసుకుని రెండు నిముషాల్లో సీను బట్టీ పట్టి ఇచ్చేసాడు.

ఓ ఐదు నిముషాల్లో సీను మొదలు అయ్యింది.

నారాయణరావు పేద తండ్రి వేషం లో ఓ అమ్మాయితో హీరో జానకిరాం ముందు నిలబడి వున్నాడు.

డైరెక్టర్ 'యాక్షన్' అన్నాడు.

'అయ్యగారు మీ కూతురు రాధని ఈ చేతులు మీదుగా పెంచి పెద్ద చేసాను' అంటూ బాధగా ఆర్ద్రతతో చెప్పాడు.

'కట్' అంటూ అరిచాడు డైరెక్టర్.

నారాయణరావు ఆగిపోయాడు.

‘ఎందుకండి అంత ఓవర్ యాక్షన్ చేస్తారు. మామూలుగా చెప్పండి చాలు.’ అన్నాడు డైరెక్టర్.

నారాయణరావు కి అర్ధం కాలేదు.

మళ్ళీ యాక్షన్ అంటూ అరిచాడు.

అదే డైలాగు మెల్లిగా చెప్పాడు.

మళ్ళీ ‘కట్' అంటూ అరిచాడు.

‘అబ్బా అదేంటండి సెంటిమెంటు డైలాగు అంత మెల్లిగా చెబుతారు. కాస్త గట్టిగా చెప్పండి.’ అంటూ మళ్ళీ ‘యాక్షన్' అంటూ అరిచాడు. డైరెక్టర్.

నారాయణరావు బాధగా చెప్పాడు.

‘కట్... అంత బాధ అవసరం లేదు. మోహంలో ఎక్స్ ప్రెషన్ అవసరం లేదు. మామూలుగా చెప్పండి. ప్రాణం తియ్యకండి... ఇదివరకు ఎప్పుడయినా చేసారా' అడిగాడు డైరెక్టర్.

‘చాలా నాటకాలు వేసాను సార్. చాలా ప్రైజులు వ చ్చాయి.’ అన్నాడు ఆనందంగా నారాయణరావు.

‘అదీ... ఎవడయ్యా నాటకాల వాళ్లకి కేరక్టర్ చెప్పింది. ఓవర్ యాక్షన్ చేస్తారు... సార్ ఇది నాటకం కాదు. టి.వి. సీరియల్. జాగ్రత్తగా... మామూలుగా చెయ్యండి.' అన్నాడు చిరాగ్గా డైరెక్టర్.

‘అలాగే సార్’ అన్నాడు నారాయణరావు.

‘ఓకే. యాక్షన్’ అన్నాడు డైరెక్టర్.

నారాయణరావు మోహంలో ఎటువంటి ఫీలింగులేకుండా, మాటల్లో ఎటువంటి బాధ లేకుండా బాడీలో అటువంటి నటన లేకుండా అదే డైలాగు చెప్పాడు.

‘షాట్ ఒకే'. అన్నాడు డైరెక్టర్. అలా నాలుగు డైలాగులు చెప్పించి ‘క్లోజులు తీసుకోండి' అంటూ డైరెక్టర్ సిగరెట్టు కాల్చుకోడానికి వెళ్లి పోయాడు. నారాయణరావు ని కెమెరా ముందు నిలబెట్టి ‘పైకి చూడండి, కిందకి చూడండి, అటు చూడండి, ఇటు చూడండి, తల నిలువుగా వూపండి, అడ్డంగా వూపండి. ఓసారి అటునుంచి ఇటు చూడండి, ఓసారి ఇటు నుంచి అటు చూడండి. ఓకే. అయిపోయింది. వెళ్ళండి.' అన్నాడు కో డైరెక్టర్.

‘ఇంకా రెండు సీన్లు వున్నాయి అన్నారు.’ అన్నాడు నారాయణరావు.

‘లేవు. ఇదొక్కటే. మీకు పేకప్. వెళ్ళచ్చు.’ అంటూ వెళ్లిపోయాడు కో డైరక్టర్.

అప్పటికి టైం రాత్రి పది అయ్యింది. నారాయణరావు బాధగా మేకప్ తుడిచేసుకున్నాడు.

చంద్రం వచ్చాడు. ‘సార్ ఇవిగో మీ అయిదువందలు. బాగా చేసారు. వచ్చినందుకు చాలా థాంక్స్.' అంటూ ఇచ్చాడు.

‘సార్ మూడు సీనులు, అయిదారు డ్రెస్సులు తెచ్చుకోమన్నారు.'

‘అదా… అది మీరు రావటం కాస్త లేటయితే ఇంకో అతనికి ఇచ్చేసాం.'

‘నేను రావటం లేటయిందా. ఉదయాన్నే అరుగంటలకి రమ్మన్నారు సార్. అందరికంటే ముందు వచ్చింది నేనే సార్. రాత్రి

ఆరుగంటల వరకు పనే లేదు.' అన్నాడు నారాయణరావు.

‘ఈ ఫీల్డు లో ఇంతే. ఇలాగే చెబుతారు సార్... తీసుకోండి. ఈసారి పెద్ద వేషం చూద్దాం.' అంటూ ఐదు వందలు నారాయణరావు చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

నారాయణరావు ఏడవలేక ఆ ఐదు వందలు వంక చూసుకున్నాడు.

గతం లోంచి వర్తమానం లోకి వచ్చి భోరుమంటూ ఏడ్చి’ ఈ ఐదు వందలుని ఖర్చు పెట్టకూడదు' అనుకుంటూ డైరీ లో పెట్టుకున్నాడు.

ఇంతలో నారాయణరావు ప్రతిబింబం ‘హలో బాసూ ఎందుకు ఏడుస్తావు. అలాంటి డైరెక్టర్లు వున్నంత కాలం టి.వి.లో నటించడానికి కావాల్సింది నటన కాదురా... నటన వచ్చినట్టు నటించడం. అది నీ లాంటి నిజమయిన నటులకి చేత కాదు. అందుకని అలా ఏడవకుండా నీకు చేతనయినంత వరకు నాటకాన్ని బ్రతికించు’. అంటూ మాయం అయ్యింది.

ఇంతలో నారాయణరావు కి ఫోన్ వచ్చింది.

ఫోను తీసి ‘హలో’ అన్నాడు నారాయణరావు

‘నారాయణరావు గారా?’

‘అవునండి నారాయణరావునే మాట్లాడుతున్నా. చెప్పండి

‘నమస్తే సార్. నేను జంబలకిడి పంబ బేనర్ నుంచి మాట్లాడుతున్న.’

'సారీ రాంగ్ నెంబర్' అంటూ ఫోన్ కట్ చేసాడు నారాయణరావు. కళ్ళు తుడుచు కుంటూ.




తెల్లవారు ఝామున...

కైలాసం లో...

"పాహిమాం పరమేశ్వరా... పాహిమాం... పాహిమాం..." దేవ భక్తగణంతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోతోంది.

రజత సింహాసనం పై పార్వతిదేవి సమేతుడై ఆశీనుడై వున్న పరమేశ్వరుడు అర్ధనిమీలిత నేత్రాలతో చిరునవ్వులు చిందిస్తూ అందరి వంక ఒకమారు చూసి "మీ అందరూ ఇక్కడకు ఏతెంచిన కారణం బేమిటి" అని అడిగాడు.

"మహాప్రభో మీకు తెలియనిదా? సర్వం తెలిసిన యోగీశ్వరులు మీరు!"

పరమేశ్వరుడు పార్వతీదేవి వంక ఒకమారు నవ్వుతూ చూసి" మీ నోటి నుండి వినాలని" అన్నాడు.

"స్వామీ! వినాయకచవితికి పట్టుమని రెండు రోజులు లేదు. మా అందర్నీ సర్వకాల సర్వావస్థల్లోనూ విఘ్నాలనుండి కాపాడుతున్న మన విఘ్ననాయకుడికి ఎప్పటిలానే ఏదో మాకు తోచినంతలో కాస్త ఘనంగా పత్రిపూజ చేసి చివరాఖర్న వ్రతకథ విని కాసిన్ని అక్షింతలు తల మీద వేసుకుని నీలాపనిందల్నుండి మమ్మల్ని మేము కాపాడు కోవాలని మా కోరిక! అంతే స్వామి!" అన్నారు.

శివుడోమారు కన్నులు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళాడు.

'అదేంటి 'తథాస్తు' అనకుండా పరమేశ్వరుడు అలా ధ్యానంలోకి వెళ్ళిపోయాడు'. అనుకుని దేవుళ్ళందరూ సందిగ్ధావస్థలో వున్నారు.

అప్పుడు... సరిగ్గా అప్పుడు ఎలకవాహనం మీద నెమ్మదిగా వచ్చాడు వినాయకుడు.

"విఘ్ననాయక వినాయక... పార్వతి తనయ వినాయక... మూషిక వాహన వినాయక" పాడడం మొదలెట్టింది దేవ భక్త బృందం.

"ఇంక ఆపండి" చిరాగ్గా అన్నాడు.

ఆ వాగ్ధాటికి శివుడు కూడా కళ్ళు తెరిచి వినాయకుడి వంక చూశాడు.

అక్కడంతా చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది.

"ఏమిటి నాయనా ఆ చిరాకు?" ప్రసన్న వదనంతో అడిగింది పార్వతి.

"ప్రతి సంవత్సరం వీళ్ళందరూ నన్ను కదలనీయకుండా చేసి పూజలు వ్రతాలు చేయడం చాలా విసుగు తెప్పిస్తోంది. అనవసరంగా తమ్ముడితో పోటీ పడి ఈ పదవి సంపాదించాను. అరె! అప్పటినుండి ప్రతి ఒక్కర్నీ కాపాడలేక చస్తున్నా. నా ముఖం నేను అద్దంలో చూసుకుని ఎంతకాలమైందో! అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను." అన్నాడు.

శివ పార్వతులతో సహా ఏమిటన్నట్టుగా ప్రశ్నార్థక ముఖాలేసుకుని అందరూ ఆయన వంక చూడసాగారు.

"నేను భూలోకానికి వెళదామనుకుంటున్నాను. యముడు సరదాగా ఎన్నోసార్లు భూలోకానికి వెళ్ళి వచ్చాడట. ఆ విషయం మీద సినిమాలు కూడా తీశారట. నారదుడు చెప్పాడు. అందుచేత నాక్కూడా అలా వెళ్ళిరావాలనుంది పైగా అక్కడ తొమ్మిది రోజులూ అంగరంగ వైభోగంగా చేస్తారట నా పూజలు. ఇదీ నారదుడే చెప్పాడు. మరి నాకు చూడాలనుండదా?" అన్నాడు.

'హతోస్మి... అదన్న మాట సంగతి. నారదుడు పెట్టిన పితలాటక మన్న మాట ఇది' శివపార్వతులిద్దరూ ఒకేసారి మనసులో అనుకున్నారు.

"అది కాదు నాన్నా! అక్కడ పరిస్థితులు ఇప్పుడు అంతగా బాగాలేవు. తెలంగాణ... సమైఖ్యాంధ్ర అని పోట్లాడుకుంటున్నార్ట. పైగా తీవ్రవాదంతో బాంబులూ అవీ పేలుతున్నాయట. ఈ సమయంలో నువ్వక్కడికి వెళ్ళడం క్షేమం కాదు. అందుకు నేను సుతరామూ అంగీకరించను" అంది పార్వతీదేవి.

"అయితే ఇవాళనుండి నాకిష్టమైన కుడుములూ... ఉండ్రాళ్ళూ తినను... పాయసం తాగను... విఘ్నాలనుండి ఎవరినీ కాపాడను... అసలిక్కడ వుండనే వుండను. మీ నుండి దూరంగా వెళ్ళిపోతాను" అన్నాడు వేదనతో.

"నాయనా... గణేశా... అంతమాటనకు. అప్పట్లో తెలియక నీ ముఖాన్ని ఖండించి గజ ముఖం అతికించాను. ఆ విషయంలో ఇప్పటికీ చింతిస్తుంటాను. నీ కోసం తండ్రిగా నేనేం చేయలేదు. ఇప్పుడు అవకాశం వచ్చింది. నీ సంతోషం కన్నా మాకు కావలసింది ఏముంది? నేను అనుమతినిస్తున్నాను. భూలోక పర్యటనకెళ్ళి... క్షేమంగా తిరిగిరా" అని దేవగణం వైపు తిరిగి "ఈసారి మీరు మనుషులు చేసుకునేటట్టుగా మట్టి వినాయకుడిని పెట్టుకుని పూజా వ్రతం చేసుకోండి. విధి రాతని ఎవరూ తప్పించలేరు" అని మరో మాటకి అవకాశం ఇవ్వకుండా కళ్ళు మూసుకుని ధ్యానంలోకి వెళ్ళిపోయాడు శివుడు.

పార్వతీదేవి కళ్ళనీళ్ళతో 'తన భర్త కోపంతో అయినా... ప్రేమతో అయినా తన కొడుకుని తననుండి ఎప్పుడూ విడదీస్తాడనుకుని' బాధగా భర్తవంక కొడుకు వంకా మార్చి మార్చి చూసి లోపలికి వెళ్ళిపోయింది.

అందరూ భారమైన హృదయాలతో ఎవరిళ్ళకి వాళ్ళు బయల్దేరారు. ఒక్క వినాయకుడు మాత్రం సంతోషంగా తనకి కావలసినవి సర్దుకోవడానికి ఎగిరి గంతులేస్తూ వెళ్ళిపోయాడు.

***

వినాయక చవితి నవరాత్రులు పూర్తయ్యాయి.

ఆ రోజు వినాయకుడు కైలాసానికి వస్తున్నాడు. ఆ ప్రాంతమంతా దేవ భక్త గణంతో కళ కళ్ళాడుతోంది. పార్వతీదేవి కొడుకుకి దిష్టి తీయడానికి కావలసిన సరంజామాతో... కొడుకుని చూడాలన్న తపనతో శివుడూ కూడా అందరితోపాటు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

అంతలో ఒక బైకు వేగంగా వచ్చి వాళ్ళందరి ముందూ ఆగింది. ఆ వాహనమేంటో అక్కడివాళ్ళకు అర్ధంకాక అది ఏమన్నా ప్రమాదం తలపెడుతుందేమోనని దూరంగా పారిపోసాగారు.

దానిమీదనుండి దిగిన గణేశుడు నవ్వుతూ ఒక చేత్తో గాగుల్స్ తీస్తూ విలాసంగా" ఎవ్వరూ భయపడనవసరంలేదు. నేను వినాయకుడిని రండి" అన్నాడు.

దాంతో అందరూ ధైర్యంగా ప్రాణాలు కుదుట పరచుకుని ఆ వాహనాన్ని ఆయన్నీ ఆశ్చర్యంగా చూస్తూ దగ్గరకి వచ్చారు.

జిగేల్ మనే దుస్తులతో కొత్త ఆహార్యంతో కనిపిస్తున్న కొడుకుకి దిష్టి తీసింది పార్వతీదేవి.

"అమ్మా! నాన్నా!! ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎంతగా మారిపోయిందో తెలుసా? కాంచనమాల కాలంనాటి హైదరాబాదు కాదు. ఇప్పుడు ఆకాశాన్నంటే బహుళ అంతస్థులు... టీవీలు... ఛానల్లూ, పార్కులు... పబ్బులు... అబ్బో కాలం గిర్రున తిరిగిందంటే

నమ్మండి. ఇదిగో ఇదేంటో తెలుసా? దీనిని బైక్ అంటారు. ఎక్కడికైనా ఆఘమేఘాల మీద వెళ్ళిపోవచ్చు. మనమింకా వాహనాల విషయంలో ఆటవిక దశలో వున్నాం. ఇది తెలుసా? దీనిని సెల్ ఫోన్ అంటారు." అని దాన్ని చూపించి "ఇది తీసుకో" అని ఒకటి తల్లి చేతిలో వుంచి "నువ్విక్కడే వుండు... కాస్సేపటి తర్వాత దీనిలో ఒక గంట మోగుతుంది. అప్పుడు ఇది నొక్కు నేను అదృశ్య రూపంలో నీతో మాట్లాడుతాను" అని అక్కడినుండి రజత కొండల మాటుకి వెళ్ళిపోయాడు.

సెల్ ఫోన్ లో గంట మోగడంతో స్విచ్ నొక్కి పార్వతిదేవి దానిని చెవిదగ్గరపెట్టుకుంది. అంతే! ఆశ్చర్యంతో "ఎక్కడినుండో గాని మన వినాయకుడు మాట్లాడుతున్నాడు" అంది.

అంతే శివుడితో సహా అందరూ దానిని తీసుకుని అందులో వినాయకుడి గొంతు విని ఆశ్చర్యానందాలతో తాదాత్మ్యానికి లోనయ్యారు.

కాస్సేపటికి నవ్వుతూ అక్కడికి వచ్చిన గణేశుడు"చూశారా! మానవుల అబ్బుర పరచే తెలివితేటలు. ఈ పరికరం ఒక్కొక్కటీ మీ దగ్గర వుంటే ఎవరు ఎవరితో నన్నా ఇట్టే మాట్లాడుకోవచ్చు. ఒకరి దగ్గర కొచ్చి మాట్లాడే శ్రమా వుండదు... నారదుడు, ఆకాశవాణిల సహాయాన్నర్థించే బాధా తప్పుతుంది. అంతేకాదు... ఏమీ పాలుపోనప్పుడు నారదుడు తెచ్చే సమస్యలతో సతమతమయ్యేబదులు ఇదిగో దీనిలో ఇలా మన దేవుళ్ళకి సంబంధించిన సినమాలు చూసుకోవచ్చు. దీంట్లో ఎన్నో సినిమాలు లోడ్ చేసుకు వచ్చాను. చూడండి" అని వాళ్ళకి చూపించి వాళ్ళు ఆశ్చర్యంతో నోరు తెరిచేలోపు" మానవులు శాస్త్ర సాంకేతిగ రంగాల్లో అప్రతిహతంగా ఎదిగిపోతున్నారు. నా అంచనా తప్పుకాకపోతే ఏదోనాడు ఇక్కడికి రాకెట్ల మీద వచ్చి కైలాసం... వైకుంటం... యమలోకం... స్వర్గం అన్నీ ఆక్రమించేస్తారు. మనమేదో వాళ్ళని ఆడిస్తున్నామనుకుంటున్నాం కాని నిజానికి వాళ్ళే మనలని ఆడించే రోజు తొందర్లో రావడం తథ్యం! అందుకే మనం వీలయినప్పుడల్లా భులోకానికి వెళ్ళి మనని మనం తీర్చిదిద్దుకోవాలి. అప్పుడే వాళ్ళకన్నా మనం ముందంజలో వుండగలం." అని బైకెక్కి రివ్వున వెళ్ళిపోయాడు.

అక్కడున్న అందరూ "తామూ భూలోకానికి వెళ్ళి వింతలు విడ్డూరాలూ చూస్తామని... అందుకు అనుమతించమని అడిగారు శివుడిని.

అందరూ ఒక్కసారిగా వెళితే సృష్టి కార్యాలకి విఘాతం కలుగుతుంది కాబట్టి కొంత కొంత మందిని ఒక గ్రూప్ గా చేసి పదిరోజులు భూలోక పర్యటన చేసి వచ్చేట్టుగా అనుమతిస్తామని చెప్పడంతో అందరూ వాళ్ళ వాళ్ళ నిజగృహాలకి ఆనందోత్సాహాలతో వెళ్ళారు.

శుభమ్! మంగళమ్!



హైటెక్ సిటీలో బస్సు దిగి ఐటీ పార్క్ లో ఆవరణలోకి ప్రవేశించాను. పెద్ద పెద్ద భవంతులతో అదో కొత్త ప్రపంచంలా ఉంది. నేను కొత్తగా ఈరోజే చేరబోయే ఎంఎన్ సి అందులోనే ఉంది. సెక్యూరిటీ ఫార్మాలిటీస్ కంప్లీట్ చేసుకుని గేట్ దాటి లోనికి వెళ్తుంటే టెన్షన్ తో గుండె వేగంగా కొట్టుకుంటోంది. రెండునెలల క్రితమే బీకాం డిగ్రీతో కాలేజ్ గేట్ దాటి బయట ప్రపంచంలోకి వచ్చాను. నెల క్రితం ఐటి కంపెనీల జాబ్ మేళాకు అటెండవడం, రెండ్రోజుల పాటు రోజుకు మూడు చొప్పున ఆరు రౌండ్స్ ఇంటర్వ్యూలు జరగడం... వారం క్రితం సెలక్టయినట్లు ఆఫర్ లెటర్ అందుకోవడం... ఇదిగో, ఇవాళ ఇలా జాయినయేందుకు ఐటీపార్కులోకి అడుగుపెట్టడం... సినిమా రీళ్లలా చకచకా జరిగిపోతున్నాయి.

నిన్న మొన్నటి దాకా కాలేజి లైఫ్ ని ఆస్వాదించిన తాను... ఇవాళ్టి నుంచి ఐటీ ప్రొఫెషనల్. ఈ ట్యాగ్ లైన్ బాగుంది కానీ, కొత్త జాబ్ ఎలా ఉంటుందో ఏమో? అరమరికలు లేకుండా కాలేజ్ ఫ్రెండ్స్ తో ఎంజాయ్ చేసి అంతులేని స్వేచ్ఛను అనుభవించిన తాను...

షిఫ్ట్ లవారీగా విభజించిన ఉద్యోగకాలానికి అంత తొందరగా కాగలనా?

ఎవరికివారే ఆర్థిక స్వావలంబనలో తలెత్తుకు తిరిగే జాబ్ మేట్స్ లో కలిసిపోగలనా?

మదిలో ఎన్నో ప్రశ్నలు... మరెన్నో సందేహాలు.

ఆలోచిస్తుండగానే ఆఫీస్ లోకి ఎంటరైపోయాను.

ఆఫీస్ అంతా ప్రశాంతంగా ఉంది. ఎవరి పనులు వారు చేసుకుపోతున్నారు. సెంట్రల్ ఏసీతో కూడిన చాలా చల్లటి ప్రదేశం.

శరీరమే కాదు, మనసు కూడా హాయిగా ఉన్నట్లనిపించింది.

"ఎక్స్ క్యూజ్ మీ..." అంటూ ఎదురొచ్చిన ఎంప్లాయిని పలకరించి 'న్యూ జాయినీ' అంటూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

ఆమె కూడా నవ్వుతూ 'హాయ్' చెప్పింది.

ఆ తర్వాతే అసలు విషయం తెలిసింది. అదే... మా ట్రైనరు ఇవాళ లీవులో ఉన్నాట్ట. మా మేనేజరు అసలు ఈ దేశంలోనే లేడు.

ప్రక్క ప్రాసెస్ మేనేజర్ చెప్పాడు.

అంటే, ఇవాళ మొత్తం నాకేం చేయడానికి లేదు. ఆఫీస్ లో అందరిని పరిచయం చేసుకొని, ఇప్పటినుంచే గెట్ టు గెదర్ కి రెడీ అవ్వాలి. అనుకుంటుండగానే శరీరానికి పదునైన ముళ్ళు గుచ్చుకున్నట్లనిపించి ఉలిక్కిపడ్డాను. పరిశీలించి చూస్తే - ప్రక్క బే లో అమ్మాయి చిరాకుగా కనిపించింది.

బహుశా, సిస్టం లో ఏదో ఫాల్ట్ వచ్చిందనుకుంట.

నేను ఆమె దగ్గరకెళ్ళి "నా పేరు స్వప్నిక. కొత్తగా జాయిన్ అయ్యాను" అని పరిచయం చేసుకున్నాను. ఆమె నన్ను కూడా చిరాకుగా చూసింది. అలా ఎందుకు చూసిందో అర్థంకాలేదు , కాసేపటి తరువాత ఆమె నన్ను, కంప్యూటర్ ని కోపంగా కొన్నిక్షణాలు చూడటం మొదలుపెట్టింది. ఆపై మౌనంగా ఉంది. ఇక లాభం లేక తిరిగి నా సీట్లో కూర్చొన్నాను. కాసేపటి తర్వాత ఇంకొక ఎర్ర చుడీదార్ అమ్మాయిని పరిచయం చేసుకోవాలన్న ఆలోచన తట్టింది. కాని, ఈమె ఎలా చూస్తుందో అని ఆ ఆలోచన మానుకున్నాను. అందరు వారి వారి పనుల్లో నిమగ్నమైవుండగా నేను వారిని గమనించసాగాను.

ఆఫీసంతా కూల్.

హమ్మయ్య! ఈ రోజు ట్రైనర్ వచ్చారు ఆఫీసుకు. ఇక నో బోర్, ఓన్లీ వర్క్, అనుకుంటూ హుషారుగా అతని దగ్గరికెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. మా ట్రైనర్ చాలా ఫ్రెండ్లీ. బాగా సహకరిస్తున్నాడు.

రెండు వారాలకి నాకు ప్రాసెస్ వచ్చేసింది. ఇక మనశ్శాంతిగా చేసుకోవచ్చు అని అనుకుంటుండగా నా షిఫ్ట్ మారిందని చెప్పారు.

ఇక నుంచి మంచు కురిసే వేళలో నా పనివేళలు కూడా కలిపారని తెలిసింది.

హాయిగా మొదటి రోజు పనితో పనిగా ఎన్జాయి చేయాలని ప్లాన్ వేశా.

నా బే లో నేను తప్ప ఎవరూ లేరు. మా టీమ్ లో ఒకరు లీవ్ లో, మేనేజరు అమెరికాలో, మా ట్రైనర్ వర్క్ ఫ్రం హోం లో, నా సంతోషానికి హద్దులెవరూ లేరని సిస్టం ఆన్ చేశా. రిపోర్ట్ పుల్ చేసి వర్క్ చేయడం మొదలుపెట్టా. కాని,ఎక్కడో ఏదో నా శ్రద్ధకి అడ్డుకట్ట వేస్తోంది.

అదేమిటా అని సిస్టం ముందు నేను పనిచేస్తూ నాకు ఎదురుగా ఉన్న బే లో చూశా. ఆ రోజు నన్ను చిరాగ్గా చూసిన అమ్మాయే

తదేకంగా చూస్తోంది. కోపంతో. నాకు అర్థం కాలేదు. మొదట నాకు భయమేసింది. నన్ను నేను తమాయించుకుని కూర్చున్నాను.

అసలీ అమ్మాయికేమైంది? కళ్ళార్పకుండా కాల్చేలా చూస్తోంది. మేనఫేక్చరింగ్ డిఫాల్టా? లేక, తన చూపే అంత? క్షణాలు నిమిషాలవుతున్నా కదలకుండా, మెదలకుండా నన్నే ఎందుకలా చూస్తోంది? ఆమె నన్నేనా అలా చూస్తోంది. అందర్నీ అలాగే చూస్తోందా? నాకేమీ అర్థం కావడం లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ ఆమె చూపుల్ని అస్సలు భరించలేకపోతున్నాను. లేచి వెళ్లి డైరక్ట్ గా ఆమెనే ఎందుకలా చూస్తున్నావ్? అని అడిగి, కదిగిపారేయాలనిపిస్తోంది. సభ్యత, సంస్కారం అడ్డొచ్చి అలా చేయలేకపోతున్నాను. మొత్తానికి ఆమెవల్ల ఆఫీసులో ఉన్న సమయం ప్రత్యక్ష నరకంలా అనిపిస్తోంది. అంటే... మాటలు, చేతలతోనే కాదు, చూపులతో కూడా ఎదుటివాళ్ళని హింసించొచ్చని ఆ అమ్మాయి చెప్పకనే చెప్తున్నట్లుంది. ఎవరికైనా ఈ విషయం చెప్తే ఏమంటారు? ఆ అమ్మాయి నిన్ను చూస్తోందని నీకెలా తెలుసు అని ముందుగా ప్రశ్నిస్తారు. తర్వాత... నువ్వు కూడా ఆ అమ్మాయిని చూస్తున్నావు కదా... అని మరో ఎదురుప్రశ్న వేస్తారు. అయితే, నా చూపులకి, ఆమె చూపులకి మధ్య తేడాని వాళ్లు గుర్తించలేరు. అలా గుర్తించే ఆధారాలతో తాను వాళ్లకి విషయం చెప్పలేదు కూడా. కారణం... ఆమె చూస్తున్నట్లే ఉంది. కానీ, ఆ చూపుల్లో మాత్రం చిటికలో శరీరాన్ని గాయం చేసే పదునైన చురకత్తులున్నాయి. సర్రున కాల్చేసే అగ్నిశిఖలున్నాయి. అందువల్లనే ఆ చూపుల్ని భరించలేకపోతున్నాను. ఆ చూపులవల్ల నా పనిమీద శ్రద్ధ పెట్టలేకపోతున్నాను.

అంటే... కొత్తగా ఉద్యోగంలో చేరిన తనని చూపుల్తో మానసికంగా వేధిస్తూ ఇబ్బందిపాలు చేయడమనే శాడిస్టిక్ నేచర్ ఆమెలో దాగున్నట్లు తెలుస్తోంది.

కెఫెటేరియాలోకి వచ్చేశా. కిటికీ నుంచి చూస్తుంటే చీకట్లో చిన్నపాటి లైట్లు కనిపిస్తున్నాయి. వేరే కంపెనీలు కూడా ఉన్నాయి. వారి ఫ్లోర్స్ నిండా వెలుతురు. అక్కడ ఇంకొంచెం సమయం ఉండాలనిపిస్తుంది. కానీ, కంప్లీట్ చేయాల్సిన పని గుర్తొచ్చి వెళ్లి మళ్ళీ నా సీట్లో కూర్చొన్నా.

ఇక ఆమె గురించి పట్టించుకోలేదు. నా పనేంటో చేసుకుపోయా.

అ రోజు కొత్తవాటి గురించి ఏదో ట్రైనింగ్ ఉంది. ట్రైనింగ్ నెం. 4 కి వెళ్లా. అక్కడ ట్రైనరు ఎక్స్ ప్లైన్ చేసి ప్రశ్నలు అడగడం మొదలుపెట్టారు. నేను సమాధానం చెప్తూ ఉండగా నన్ను ఇంకెవరో గమనిస్తుండడం నా మనసుకి తట్టడంతో అటువైపు చూశా. చూస్తే ఆ అమ్మాయే. నాకు చాలా బాధేసింది. నన్ను ఏడిపించడానికి తను ప్రయత్నిస్తోందని అర్థమౌతోంది.

ఇలాగైతే నేను వేటిపై శ్రద్ధ వహించగలను? నా మనసులో అనుకుంటూ ఫ్లోరుకు వెళ్ళాను. మధ్య మధ్య మనసు

చివుక్కుమంటున్న ఆ చూపులను గుర్తుచేసుకోకూడదని నా మనసుకి గుర్తుచేస్తున్నాను. ఇంతలో రాత్రి పదకొండు గంటలైంది. మిడ్ షిఫ్ట్ వాళ్ళు వెళ్ళిపోయారు. నేను మాత్రమే నా బే లో ఉంటాను. ఆమె వైపు చూడాలంటే భయంతో గుండెకు ధైర్యం చాలేదు.

ఇక కిందకి వచ్చేశా. అందరు స్నేహితులతో అక్కడకి వచ్చి చల్లగాలి పీలుస్తున్నారు. నేను మాత్రం మనసులో బాధతో, ఒంటరిగా. ఇంతలో, * *

*

" అసలా అమ్మాయంటే నీకెందుకే అంత కసి? " నేను క్యాంటీన్ లోకి అడుగు పెట్టబోతుండగా వినిపించిందో గొంతు. " కసి కాదే, భయం, " నన్ను చూపులతో వేధిస్తున్న అమ్మాయి గొంతది. ఆశ్చర్యంతో అక్కడే ఆగిపోయాను. బహుశ, అంతా అదే బ్యాచ్ కావచ్చు. హస్కు వేసుకుంటున్నారు. నన్నెవ్వరూ గమనించలేదు. భయమా, అదేంటే? అడిగిందింకొక వాయిస్. అవునే. నాకా అమ్మాయిలో ఎదో తెలిని షార్ప్ నెస్ కనిపించింది. డౌట్ లేదు. ఆ అమ్మాయి మనందరినీ దాటుకుని టీం లీడర్ అభిమానం పొందడానికి. అందుకే ఆ అమ్మాయిని ఏదోక విధంగా బయటకు సాగనంపాలని నిర్ణయించుకున్నా..." ఏమిటి? కేవలం చూపులతోనా? ఆశ్చర్యంగా అడిగిందింకో అమ్మాయి. చూపులతోనా అంటున్నావు, చూపుకెంత శక్తి ఉందో తెలుసా? నిరంతరం ప్రసరించే మన చూపులతో ఎదుటివారిని ఎంతో ఇరిటేట్ చెయ్యొచ్చు..."ఆ మాటలు విని నిర్ఘాంతపోయాను. ఒక సీనియర్ నామీదంత కసితో ఉంటే ఇక నేనక్కడ ఉండడం సాధ్యం కాదనిపించింది.

" నేనీ ఉద్యోగం చేయను డాడీ..." అదేరోజు చెప్పాను.." అలాగేనమ్మా..నీ ఇష్టం. కానీ ఎందు? అడిగారు డాడీ. విషయమంతా చెప్పాను. డాడీ కొంతసేపు ఆలోచించి..."చూడమ్మా. ఉద్యోగం చెయ్యడం, మానడం అనేది నీ ఇష్టం. కానె, అంతకంటే ముఖ్యమైన విషయం చెప్తాను విను. ఇది మన జీవితం. మనం మన చుట్టూ ఉన్న మన లాంటి మనుషుల మధ్యే బ్రతకాలి. ఎక్కడికెళ్ళినా మనుషులే ఉంటారు. ప్రేమించేవారు ఉన్నట్టే, ద్వేషించేవారూ ఉండొచ్చు. అభివృద్ధికి అసూయ ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. ముల్లును ముల్లుతోనే తీయాలి. ప్రతికూల పరిస్థితులనూ, వ్యక్తులనూ, తట్టుకుంటూ, తప్పుకుంటూ, ఎదుర్కొంటూ ముందుకు సాగడమే మన ప్రతిభ." అన్నారు. డాడీ మాటలతో నాలో ఏదో తెలిని శక్తి కూడగట్టుకున్నట్టనిపించింది. అప్పుడే ఒక స్థిర నిర్ణయానికి వచ్చాను.....

సరిగ్గా, అదే సమయంలో నాకో ఆలోచన తట్టింది. ఆ ఆలోచనే నాలో కొండంత ధైర్యాన్ని నింపింది.

* *

*

ఆ ఆలోచనను వెంటనే అమలుపరచాలనుకుంటూ ఫ్లోర్ లో అడుగుపెట్టాను.

సీన్ రివర్సయింది. ఆమె కాదు... ఇప్పుడు నేనే ఆమెను తీక్షణంగా చూస్తున్నాను. కళ్ళార్పకుండా, కదలకుండా, మెదలకుండా అదేపనిగా ఆమెనే చూస్తున్నాను. చూపుల్లో ఏ భావం ప్రస్ఫుటం కాకుండా ఆమెనలా చూస్తూనే ఉన్నాను. క్షణాలు... నిముషాలుగా మారుతుండగా ఆమెనే చూస్తున్నాను. చూపు తిప్పకుండా అదేపనిగా ఒక్కళ్ళవైపే ఫోకస్ చేసి చూస్తే కలిగే ఇబ్బందేంటో ఆమెకి తెలియాలనే చూస్తున్నాను. నా చూపుల ధాటికి తట్టుకోలేక ఆమె వచ్చి సూటిగా నన్నేమైనా అడగగలదా? కచ్చితంగా అడగలేదు. ఎందుకంటే... నా చూపుల్ని ఆమె గమనించిందంటే... నన్నూ ఆమె చూస్తున్నట్లే కదా!

టిట్ ఫర్ టాట్... చూపుల్తో గుచ్చిగుచ్చి చంపేసే ఆమెలాంటివాళ్ళకి అదేదారిలో గుణపాఠం చెప్పి తీరాల్సిందే... అనుకుంటూ ఇప్పటికీ ఆమెనే టార్గెట్ చేస్తూ అలా... అలా చూస్తున్నాను. ఈ గేమ్ ఎంత కాలం నడుస్తుందో నేనెలా చెప్పగలను? జవాబు చెప్పాల్సింది ఆమె మాత్రమే. ఔనా?




"సునీల్! స్నానానికి రావాలి. లేటయిపోతున్నావ్" వీక్షణ గట్టిగా పిలిచింది వంటింట్లోంచి. "ఇదిగో ఐదు నిమిషాల్లో వస్తున్నానమ్మా" బదులిచ్చాడు వ్రాస్తున్న పుస్తకంలోంచి తల ఎత్తకుండానే!

"ఎంతసేపురా అవతల ఆటో వచ్చేస్తుంది. ఏమీ తినకుండా పరిగెడతావ్, రా త్వరగా" మళ్ళీ అరిచింది వీక్షణ. "అబ్బా ఐదు నిమిషాలన్నానా! ఆగు... ఇంక పిలవకు" విసుగ్గా చెప్పాడు సునీల్.

"ఇంతకీ నువ్వు వెలగబెడుతున్న ఘనకార్యం ఏంట్రా?" విసురుగా బెడ్రూం లోకి వచ్చి సునీల్ చేతిలో పుస్తకం లాక్కుంది వీక్షణ. "అమ్మా, నేను ఒక పొయెమ్ సగంలో ఉన్నానమ్మా, లెట్ మీ కంప్లీట్, ప్లీజ్ అమ్మా!" బతిమాలసాగాడు సునీల్.

"ఉద్ధరించావులే అవతల స్కూల్ కి లేటయిపోతోంది. పదపద, సాయంత్రం పూర్తి చేద్దువులే ఈ పోయమ్. అని సునీల్ చెయ్యి పట్టుకుని బాత్రూంలోకి నెట్టింది వీక్షణ. "అబ్బా, మూడ్ పోతే మళ్ళా వ్రాయలేను" సణుగుతూ స్నానానికి వెళ్ళాడు సునీల్.

శ్రావణ శుక్రవారం పేరంటానికి వెళ్ళింది వీక్షణ ఎదురింటికి. ఆ కోలనీ మహిళలంతా తమ నగలు, పట్టుచీరలు చూపించుకోవడానికి పేరంటం అనేది ఒక వేదిక. వాళ్ళకదో వేడుక!

రజిత, కోమలి, రాధ, అప్పటికే విశాలి ఇంట్లో ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. వీక్షణని చూడగానే "అబ్బ వీక్షణా! ఇంత లేట్ గానా రావడం? చూడు, కోమలి పగడాల సెట్ ఎంత బాగుందో! ఇంతకీ నువ్వేం తీస్కున్నావ్ పండక్కి" అంటూ చుట్టుముట్టారు అమ్మలక్కలు. "ఆ, అన్నట్టు సునీల్ కి ఈ మధ్య దేంట్లోనో ప్రైజ్ వచ్చిందట కదా! మా అమ్మాయి చెప్పింది" అంది రాధ వీక్షణ చీర అంచు సరిచేస్తూ.

"ఆ, వ్యాసరచనలో సెకండ్ ప్రైజ్ వచ్చింది రాధా! అంతా వాళ్ళ మావయ్య పోలికేవాడికి. ఎప్పుడూ ఏదో వ్రాస్తూనో, చదువుతూనో ఉంటాడు స్కూల్ టైమైనా తెమలడనుకో," కంప్లైనింగ్ గా అంది వీక్షణ.

"పోన్లే వీక్షణా! ఎంతమంది పిల్లలు అంత టాలెంటెడ్ గా ఉంటారు వాడిలా? అస్తమానం ఆటలూ, పోచికోలు కబుర్లేగా వీళ్ళకి! మీ వాణ్ణి బాగా ఎంకరేజ్ చెయ్ మంచి రైటరు అవుతాడు" అన్నారు ఫ్రెండ్స్ ముక్తకంఠంతో.

"అలాగే" అని నవ్వుతూ వాయనం తీసుకొని ఇంటికి బయలుదేరింది వీక్షణ.

*****

ఆరోజు స్కూల్ నుంచి బిక్కమొహంతో వచ్చాడు సునీల్. "ఏం నాన్నా అలా వున్నావ్, మధ్యాహ్నం అన్నం తినలేదా? ఏం జరిగింది?" అనునయంగా అడిగింది వీక్షణ.

"లేదమ్మా నిన్న మా స్కూల్లో టీచర్స్ డే అయిందన్నాను కదా..."

"అవును. నువ్వు పొయమ్ కూడా చెప్పినట్లున్నావ్ కదరా...?"

"అవునమ్మా నన్ను అంతా మెచ్చుకున్నారు, చీఫ్ గెస్ట్ కూడా పొగిడారు. టీచర్ గురించి నేను - మాగురువు శ్రేష్టమైన తరువు - నిజంగా వారు కల్పతరువు, అని పోలుస్తూ తరువు నీడని, మధుర ఫలాలని ఇస్తే గురువు ప్రేమాప్యాయతల నీడని, విద్యా ఫలాలని ఇస్తారని, తరువు వేళ్ళని నీటితో తడిపినట్లే గురుపాదాలని కృతజ్ఞతాబాష్పాలతో అభిషేకించినా ఋణం తీరదని చెప్పానమ్మా.... కానీ... కాని... ఇవాళ మా తెలుగు టీచర్ నన్ను అందరి ముందు ఎగతాళి చేసారమ్మా." ఏడుపు గొంతుతో చెప్పాడు సునీల్.

"ఏమన్నార్రా?" ఆరాటంగా అడిగింది వీక్షణ. "నువ్వు కవిత వ్రాయడమేంటి? నీ మొహం! నువ్వు వ్రాసిన కవితంటే నేనసలు నమ్మను. నిజం చెప్పు. ఎక్కడ కాపీ కొట్టావు? అన్నారమ్మా."

"నిజంగా నేనే వ్రాసాను టీచర్" అన్నా ఆవిడ ఒప్పుకోకుండా "నీకంత సీన్ లేదులేగాని ఏ పుస్తకంలోంచి చూసి బట్టీ పట్టి చెప్పావో చెప్పు అన్నారమ్మా. మా ఫ్రెండ్స్ అంతా ఒకటే నవ్వులు." దీనంగా చెప్తున్న సునీల్ ని చూస్తుంటే వీక్షణకి గుండె తరుక్కుపోయినట్లయింది. "డాడీ రానీ చెప్దాం" అంది ఓదార్పుగా.

*****

ఆఫీస్ నుంచి వచ్చిన మధుకర్ కి కాఫీ ఇచ్చి జరిగింది క్లుప్తంగా వివరించింది వీక్షణ. కాస్సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు మధుకర్. "పిల్లల్ని ప్రోత్సహించాల్సిన టీచర్లే ఇలా వెటకారంగా మాట్లాడితే వాళ్ళ భవిష్యత్ ఏమైపోవాలండీ? మీరు ఒకసారి హెడ్ మాస్టర్ తో మాట్లాడి రండి" అర్ధింపుగా అంది వీక్షణ.

"కంప్లైంట్ చేయడం పెద్ద పనేం కాదు, కానీ దానివల్ల జరిగేదేంలేదు. ఆయన ముందు తలవంచుకుని తిరిగి మనవాణ్ణి హేళన చేయచ్చు. దానికంటే ఆవిడకే వీడు తను వ్రాసిన కవితల పుస్తకం చూపిస్తే మంచిదేమో? అర్ధం చేస్కుంటుంది కదా. రేపు నేను వాడి కవితల పుస్తకం పట్టుకెళ్ళి మాట్లాడతాలే" అన్నాడు మధుకర్ స్నానానికి లేస్తూ.

"వద్దు డాడీ, మా టీచర్ బుక్ చూసినా నమ్మరు. ఎక్కడో కాపీ చేశాననే అంటారు. తనన్న మాట ఆవిడ వెనక్కి తీస్కోరు సరికదా, ఇంకా సాధించాలని చూస్తారు. ఇక మీదట కవితలు ఎప్పుడూ వ్రాయను" కన్నీటి పర్యంతం అయ్యాడు సునీల్.

సునీల్ 8వ తరగతి చదువుతున్నాడు. చాలా సున్నితమైన మనసు. ఎవరయినా ఏదైనా అంటే లోలోపల కుమిలిపోతాడే తప్ప ఎదురించి మాట్లాడడు. మంచి భావుకత వున్న కుర్రాడు. వాళ్ళ మావయ్య వాడు 4వ క్లాసులో వున్నప్పుడు డైరీ ప్రెజెంట్ చేసి ఏవైనా మంచి విషయాలు, కవితలు దీంట్లో వ్రాస్కో అంటూ మంచి కొటేషన్ వ్రాసి ఇచ్చాడు. ఆ ప్రేరణతోనే దాదాపు 30 దాకా కవితలు వ్రాసాడు. కానీ అందరిలో చాటుకోవడం తనకి ఇష్టం వుండదు. తల్లిదండ్రులకి, కొంతమంది సన్నిహితులకి తప్ప సునీల్ కవితలు వ్రాస్తాడన్న విషయం ఎవరికీ తెలీదు. కానీ టీచర్ అభినందించకుండా ఇలా ఎగతాళి చేయడంతో సునీల్ ఆత్మాభిమానం దెబ్బతింది. దాంతో ఇంకెప్పుడూ వ్రాయకూడదు, వ్రాసినా ఎవరి ముందు చదవకూడదు అని తీర్మానించేసుకున్నాడు.

*****

నాల్గు రోజులు గడిచాయి. అనుకోకుండా వీక్షణ తమ్ముడు వేణు ఏదో సాహితీ సమావేశంలో పాల్గొనడానికి హైదరాబాద్ వచ్చాడు. తమ్ముణ్ణి చూసి వీక్షణ చాలా సంతోషించింది. స్కూల్ నుంచి వస్తూనే సునీల్ "వేణు మామా" అంటూ అల్లుకుపోయాడు.

"ఏరా సుని ఏం చేస్తున్నావ్ రా? ఈ మధ్య నీ కబుర్లేం తెలీడం లేదు? నేనిచ్చిన బుక్ లో కవితలు నింపుతున్నావా లేదా? టీచర్స్ డేకి ఏదో కవిత చెప్పావట విన్పించు" అని అడిగేసరికి సునీల్ ముఖం చిన్నబోయింది. "అదీ" అంటూ మాటలు మింగేశాడు.

జరిగిందంతా అక్కద్వారా విని పెద్దగా నవ్వేశాడు వేణు. "నువ్వు నవ్వుతున్నావ్ గాని మేమెంత బాధపడ్తున్నామో తెల్సా ఆవిడ మాటలకి? స్కూల్ కి వెళ్లి కనుక్కోమంటే ఇంకా కక్ష కట్టేసి, ఇంకా హేళన చేస్తుందేమోనని మీ బావగారు ఊర్కుండిపోయారు. ప్రోత్సహించి, వెన్నుతట్టాల్సిన టీచర్లు ఇలా చేయడం ఏమన్నా బాగుందట్రా వేణూ!" వేదనగా అడిగిన వీక్షణ మాటలకి అడ్డు తగుల్తూ "ఏంటక్కా నువ్వు కూడా...! ఆవిడ తప్పుగా ఏమందని అసలు...? అంటున్న వేణుని ఆశ్చర్యంగా చూడసాగారు వీక్షణ, సునీల్.

"ఏంటి? ఆవిడ తప్పుగా ఏమనలేదా నువ్వేం మాట్లాడుతున్నావో అర్ధమవుతోందా అసలు?" కోపంగా అడిగింది వీక్షణ. సునీల్ అయితే ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు

"అవును,అర్ధమయ్యే మాట్లాడుతున్నా, ఏరా సునీల్ మీ టీచర్ ఏమన్నారు?'

"అదే మామా... ఇది నువ్వు వ్రాయనే లేదు ఎవరో వ్రాస్తే కాపీ కొట్టావు అన్నారు" అన్నాడు చెప్పలేక చెప్పలేక చెప్తున్నట్లు. "అంటే... అర్ధమేంటి? ఇంత చిన్నపిల్లాడు అంత పెద్దస్థాయి కవిలా వ్రాసాడనే కదా! నీ వయసుకి, నీ క్లాసుకి నువ్వు వ్రాసిన కవిత ఎన్నో రెట్లు హెచ్చు స్థాయిలో ఉంది కాబట్టి ఆమెకి నమ్మశక్యంగా లేదు అందుకే ఎవరో పెద్ద కవి వ్రాసిన కవితగా నీ కవితని బావించింది. నువ్వు నీ వయసుకి తగ్గట్టు మామూలు కవిత వ్రాసుంటే నమ్మేది. అది చూస్తే ఎవరో చేయి తిరిగిన కవి వ్రాసినట్లు వుంది. అందుకే ఆవిడ నువ్వు వ్రాయలేదు ఎవరో వ్రాసింది చెప్పావ్ అంది. అంటే ఇది ఖచ్చితంగా అభినందనే గాని వెటకారం కాదు. దీనివల్ల నువ్వు బాగా ఇన్ స్పైర్ అయ్యి ఇంకా ఇంకా బాగా వ్రాయాలి కానీ ఏడుస్తూ కూచోకూడదు తెల్సిందా!" అన్నాడు నవ్వుతూ వేణు సునీల్ భుజం తడుతూ.

"హాట్సాఫ్ బామ్మర్దీ" అంటూ చప్పట్లు కొడ్తూ లోపలికి వస్తున్న మధుకర్ ని నవ్వుతూ అభివాదం చేస్తూ "అవును బావా! ఇదంతా హౌ వియ్ లుక్ ఎట్ థింగ్స్ మీద ఆధారపడి ఉంటుంది అంతే! ఏ విషయమైనా మనం ఎలా ఆలోచిస్తే అలాగే అన్పిస్తుంది, అలాగే కన్పిస్తుంది. అందుకే ఎప్పుడూ కూడా పాజిటివ్ గా ఆలోచించడం, పాజిటివ్ గా చూడ్డం, పాజిటివ్ గా మాట్లాడ్డం అలవాటు చేసుకోవాలి. అప్పుడు అవతలివాళ్ళు ఏ ఉద్దేశ్యంతో మాట్లాడినా పాజిటివ్ గానే స్పందిస్తాం."

"కానీ వేణూ..." ఏదో చెప్పబోతున్న వీక్షణని ఆపుతూ "వీక్షణక్కా! నీ వీక్షణాలు మార్చుకో! మన దృష్టి మార్చుకుంటే అంతా బాగా కన్పిస్తుంది. సునీల్ ఒకటి గుర్తుపెట్టుకో. తల్లిదండ్రులు, టీచర్లు ఎప్పుడూ పిల్లల్ని వాళ్ళ ముందు పొగడరు. పొగడకూడదు కూడా! మీ టీచరు నిన్ను పరోక్షంగా ఎవరో వ్రాసిన కవిత అంటూ నిన్ను, నీ స్థాయిని ఎంతో ఎత్తుకు తీసుకువెళ్ళారు. ఇది నిజమైన అభినందన. నీ ప్రతిభని సాన పెట్టుకుంటూ భవిష్యత్తులో గొప్పకవివి కావాలి, ఆల్ ద బెస్ట్ మై బోయ్ అంటూ

మనస్ఫూర్తిగా అభినందిస్తున్న వేణుమామ వైపు ఆరాధనగా చూస్తూ ఉండిపోయాడు సునీల్.




మా పక్కింటి వాటాలోకి శారదా వాళ్ళు అద్దెకి వచ్చేక వీధికో కళ... కాంతీ వచ్చాయనిపించింది.

సినీ హిరోయిన్ కి వున్నంత గ్లామరు బిల్డప్పు... నవలా కథానాయికకి వున్నంత అందచందాల వర్ణన లేకపోయినా... ఆ సాధారణ అందం ఆమె వ్యక్తిత్వంతో మిస మిస లాడుతోంది.

ఆమెలో వున్న గొప్పతనమేమిటంటే కలుపుగోలుతనం. అలా అని ఓ పూసుకు తిరగదు... అవసరం అది తనదైనా... మనదైనా ప్రత్యక్షమవుతుంది. తీరిపోయాక డిటాచ్ అయిపోతుంది.

వాళ్ళ నాన్న మునిసిపాలిటిలో పనిచేస్తున్నాడు. తనకో అన్నయ్య కూడా వున్నాడు. రోడ్లు పట్టుకు తిరగడం తప్ప మరే ఉపయోగం లేదు. వాళ్ళ అమ్మకి భక్తి ఎక్కువ. ఎప్పుడూ అధ్యాత్మిక ఆనందంలో మునిగి తేలుతూంటూంది. అంచేత ఇంటికీ... ఇంటిల్లిపాదికీ అంతా తానే అయి అన్ని పనులూ చేస్తుంటుంది.

శారద మా అమ్మకి కూడా చేదోడు వాదోడుగా వుండడం వల్ల మా అమ్మ దగ్గర మంచి మార్కులే కొట్టేసింది. అవన్నీ పక్కన పెడితే ఏ అమ్మాయిని చూసినా కలగని మానసిక శారీరక పులకరింతలు ఈమెని చూస్తే కలుగుతున్నాయి. ఎప్పుడెప్పుడు ఆమె కనిపిస్తుందా... అని ఆత్ర పడడం... చూశాక అదో మానసిక తృప్తికి లోనవడం జరుగుతోంది. మాట్లాడాలనిపిస్తోంది కాని ఎలా? ఓ స్త్రీ అయితే మరో స్త్రీతో సింపుల్ గా మాట కలపవచ్చు... కాని పెళ్ళికాని యువకుడు మరో పెళ్ళికాని పిల్లతో ఎలా మాట్లాడడం? సినిమాల్లో అయితే యువతీ యువకుల మధ్య 'ఏరా... ఏంట్రా'లతో కథ కలిపేస్తారు... నడిపేస్తారు... నిజ జీవితంలో అంత ఈజీ మాత్రం కాదు.

తను నా మనసులో ఇంత సంచలనానికి కారణమైనా... నేను తన మనసుని స్పృశించలేకపోయాను... అది తెలుస్తూనేవుంది. ఒక పురుషుడు ఎదురైతే ఎలా ప్రవర్తిస్తుందో అలాగే వుంటుంది తప్ప సిగ్గుపడడం... నన్ను చూడాలని ఉబలాటపడం... నేను ఎదురుపడితే తొట్రుపడడం... అబ్బే అలాంటివేం లేవు. వన్వే ప్రేమకథలు నిరంతరం మనసుని కోస్తూ ఇలాగే వుంటాయి. టూ వే అయితేనే రసరమ్యంగా వుంటాయి.నాది త్వరలోనే టూ వే అయితే బాగుండును. వాళ్ళ అమ్మ ఎంతోమంది దేవుళ్ళని కొలుస్తూవుంటుంది. నా మొర ఆలకించి వాళ్ళు ఆమెకి నామీద గోరంత ప్రేమ కలిగిస్తే... దాన్ని కొండంత చేసుకునే శక్తి నాకుంది. నిజం చెప్పాలంటే నా అంత మంచి వాడు ఆమెకి వాళ్ళ తల్లిదండ్రులకి ఎక్కడ దొరుకుతారు?(ఇది అతిశయోక్తి కాదండోయ్!).

ఓ రోజు నాకు సెలవు అవడంతో ఒక్కడినే ఇంట్లో వున్నాను. ఇంట్లో వుంటే ల్యాప్ టాప్ మీదా ప్రొజెక్ట్స్ కి కోడ్ రాస్తుంటాను. అన్నట్టు నా గురించి చెప్పలేదు కదూ... పేరు శ్రీకర్. సాఫ్ట్ వేర్ ఇంజనీర్. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ కుదేలయినా నాకు మాస్టర్ స్కిల్స్ వుండడం వల్ల అవే నన్ను ఉన్నత పదవిలో మంచి శాలరీతో కొనసాగేలా చేస్తున్నాయి. మా నాన్నకి అమ్మకి ఒక్కడినే పుత్ర రత్నాన్ని... అందుకే గారాబంగా పెరిగాను. అలా అని చెడిపోలేదు. అందుకే వాళ్ళకి నేనంటే ప్రాణం. నాక్కూడాను. కానీ ఇప్పుడిప్పుడే అదికొంచెం డైల్యుట్ అయి శారద అందులోకి ప్రవేశిస్తోంది. కోడ్ రాయడం పీక్ స్టేజ్ లో వుండగా శారద నాదగ్గరికి పరుగు పరుగున వచ్చి "మా అన్నయ్య నిన్న రాత్రనగా బయటకి వెళ్ళాడు... రోజూ ఆలస్యమైనా రాత్రికే వచ్చేస్తాడు... కాని... నిన్న రాత్రి రా..." చెప్పలేక ఏడవసాగింది.

నేను "ఏం ఫర్వాలేదు... ఎక్కడికి పోతాడు? తాగి ఎక్కడైన పడిపోయుంటాడు. తాగింది దిగితే ఇంటికి వస్తాడు." అన్నాను కాస్త కోపంగా.

"ప్లీజ్... ఇప్పటికే ఆలస్యమైంది అందుకే మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను. దయచేసి వస్తారా కాస్త వెదుకుదాం" అంది.

నేను 'సరే' అని లుంగీ బనియన్ లోంచి ప్యాంట్ షర్ట్ లోకి మారి ఆమెతో బయల్దేరాను.

బయటకొచ్చి ఆటో మాట్లాడాను. ఇద్దరం కూర్చున్నాం. రోజువీచే గాలి అయినా మా ఇద్దరి మధ్యాచేరి పులకింతలు రేపుతోంది. అప్పుడప్పుడు తగులుతున్న ఆమె స్పర్శ అర్థం కాని మధురానుభూతికి లోనుచేస్తోంది. తనకవేం పట్టట్లేదు. ఆందోళనగా వాళ్ళన్నయ్య కోసం బయటకి చూస్తోంది. కొంతదూరం ప్రయాణించాక ఆటో చౌరస్తాకి చేరుకుంది. అక్కడ వున్న అంబేద్కర్ విగ్రహం దగ్గర ఒళ్ళు తెలియకుండా పడుకుని వున్నాడు వాళ్ళన్నయ్య. 'నేను ఇంతకు ముందు ఎక్స్పెక్ట్ చేసింది కరక్టే కదా' అన్నట్టు చూశాను. ఆమె పట్టించుకుంటే కదా! గబ గబ ఆటో దిగి వాళ్ళన్నయ్య కాళ్ళదగ్గర పట్టుకుని... నన్ను తలదగ్గర పట్టుకోమన్నట్టుగా కళ్ళతో రిక్వెస్ట్ చేసింది. నేను ఆమె కలసి ఆ అన్నయ్యశాల్తిని ఆటోలో కుదేసి అతనికి చెరోపక్కనా కూర్చున్నాం. అతన్నుంచి వస్తున్న వెగటువాసన మధురానుభూతుల్ని మంటగలిపేసింది. ఇంటికి చేరి అతన్ని వాళ్ళింట్లోకి చేర్చి థాంక్సులు తీసుకుని మా ఇంటికొచ్చాను. ఇన్సిడెంట్ చిరాకు కలిగించేదయినా శారదకి నాకూ వున్న దూరాన్ని కొంత తగ్గించింది. తను నన్ను చూసినప్పుడల్లా చిన్నగా నవ్వి విష్ చేయడం... మరీ దగ్గరగా కనిపిస్తే కాస్త మాటల ముత్యాలు రాల్చడం చేస్తోంది.

నాకు కాలం ఎలా దొర్లిపోతోందో తెలియడం లేదు. ఎప్పుడు ఆమె మనసులో మెదిలినా మనసు మధురానుభూతుల మయమవుతోంది. ఓ సాయంత్రం "అమ్మా! నేను శారదని ఇష్టపడుతున్నాను. నాకు తెలిసి నీకు కూడా ఆమె అంటే ఇష్టముంది. నాన్నతో మాట్లాడి మా పెళ్ళికి ఒప్పించవూ! " అన్నాను.

అమ్మ ఆశ్చర్యపోకపోయినా "అది కాదురా మా అన్నయ్య కూతురు నీకు ఈడైనది చిన్నప్పటినుండీ నీ మీదే ఆశలు పెట్టుకుంది. అయినా నేనేం నీ నిర్ణయానికి అభ్యంతరం పెట్టను కాకపోతే... నీ మరదలి మనస్తత్వం నీ చిన్నప్పటినుండీ నీకు తెలుసు. మన కుటుంబాలు కూడా చాలా ఏళ్ళుగా కలిసి మెలిసి ఉంటున్నాయి. అలాంటిది నిన్న గాక మొన్న పక్కింటి వాటాలోకి వచ్చిన శారదని నువ్వు ప్రేమిస్తున్నావంటే అది తాత్కాలిక ఆకర్షణ, వ్యామోహం తప్ప మరోటి కాదని నా అభిప్రాయం! పైగా వాళ్ళ అన్నయ్య తాగుబోతు... నాన్న మునిసిపాలిటీలో చిన్న ఉద్యోగి. ఇంతా కష్టపడి కెరియర్ని తీర్చి దిద్దుకుని తొందరపాటు నిర్ణయాలతో జీవితం నాశనం చేసుకోకూడదని నా సలహా! ఏదేమైనా నీ జీవితం... కాదు కూడదంటే నాన్నని ఒప్పించే బాధ్యత తీసుకుంటాను." అంది.

నాకు సపోర్ట్ చేసే తల్లిదండ్రులుండడం నా అదృష్టం. కాని బాధ్యత నాకే వదలడంతో తొందరపడకుండా కాస్త నిదానంగా మరోసారి ఆలోచించడం మంచిదనిపించి "అలాగేనమ్మా... మరి కొంత సమయం తీసుకుని చెబుతాను" అన్నాను.

*****

సినిమాల్లో చూపించినట్టుగా పార్కుల చుట్టూ తిరగడానికి నా ఉద్యోగం సహకరించక తనకీ ఇంటి బాధ్యతలతో కుదరక కొంతకాలం గడిచిపోయింది. ఆ సమయంలోనే వాళ్ళ అన్నయ్య తాగి లారి కింద పడి చనిపోవడం... వాళ్ళ నాన్న పై ఆఫీసరు పై కోపంతో చెయ్యెత్తడంతో సస్పెండ్ అవడం జరిగిపోయాయి. ఇహ ఆ ఇంటి బాధ్యత శారద భుజాలపై పడింది. ఓ ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగానికి చేరింది. ఆమె ముఖంలో మునుపటి ఉత్సాహం లేదు. బ్రతకడానికి తినాలి. తిన్నందుకు శ్రమించి ఇంట్లోవాళ్ళకి ఇంత పెట్టాలి. ఆమె పరిస్థితికి జాలేసినా నేను తనని పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను.

చిన్నప్పటినుండి ఎంతో కష్టపడి చదివి పైకొచ్చాను. అమ్మా నాన్నా నా మీద కొండంత ఆశ పెట్టుకున్నారు. మా నాన్న ఒక కంపెనీలో మేనేజరు. మాది డిసిప్లిన్డ్ ఫ్యామిలి. నా మరదలికి కూడా నేనంటే పంచప్రాణాలు. తనూ నాతో సమానంగా చదువుకుని చక్కటి ఉద్యోగం చేస్తోంది. రేపటి అందమైన భవిష్యత్తుని వదులుకుని ఆమెని చేసుకోవాలనుకోవడం మూర్ఖత్వమే! రేపు శారదతో పెళ్లయినా తన వాళ్ళు కష్టాల్లో వుంటే తను సుఖంగా వుండలేదు. తనూ వుండలేడు. ఆమెలో ఆశలు రేపకపోవడం మంచిదయింది. కొన్ని జీవితాలంతే బురదలో కమలాలు. బాగున్నాయనుకోవాలి అంతేకాని దగ్గరకెళ్ళే ప్రయత్నం చెయ్యకూడదు. వెళితే బురద అంటుకుంటుంది. నాకు లోపలొకటుంచుకుని బయటకి మరోటి వ్యక్తం చేయడం చేతకాదు. రెండున్నర గంటల సినిమా చూసి... అందులో నటించే వాళ్ళ ప్రేమని అనుకరించి జీవితాలని బుగ్గి చేసుకుంటున్నవాళ్ళు ఎంతో మందున్నారు. ఇంట్లో వాళ్ళ మూర్ఖత్వానికి శారద బలైపోతుంది. ఏమీ చెయ్యలేం! అయినా కొన్నాళ్ళ పాటు నా మనసులో కొలువైన తనకి ఏదైనా కానుక ఇవ్వాలనిపించింది. ఒకరోజు తను ఏకాంతంగా వున్నప్పుడు తన చేతిలో లక్షరూపాయల చెక్కుపెట్టి, "ఒక స్నేహితుడిగా ఇస్తున్నాను కాదనకు. రేపు నీ పెళ్ళికి ఉపయోగపడుతుంది" అన్నాను. ఆమె కన్నీళ్ళతో పరిగెత్తుకుని వాళ్ళింట్లోకి వెళ్ళిపోయింది. అప్పుడనిపించింది ఆమె నన్ను ప్రేమిస్తోందేమోనని.

అమ్మతో నేను మరదలిని చేసుకుంటానన్న విషయం చెప్పాను. ఆవిడ ఆనందం అంతా ఇంతా కాదు. నిజమే నా మరదల్లో లేనిదీ శారదలో వున్నది ఏదీ లేదు. మనలోని బలహీనతని అదుపు చేసుకుంటే అందరి జీవితాలు బాగుంటాయి.

*****

మా పెళ్లై రెండు సంవత్సరాలయింది. అమెరికాలో స్థిరపడ్డాం. జీవితం పంచ రంగుల వర్ణచిత్రంలా వుంది. అప్పుడప్పుడు ఎందుకో శారద గుర్తుకొస్తుంది. ఆ క్షణం మనసులో కాస్త బాధేస్తుంది. కానీ నేను తీసుకున్న నిర్ణయం మాత్రం తప్పనిపించదు.




"హలో... హలో... కాస్త ఆగండి!" వెనుకనే పెద్ద పెద్ద అడుగులేస్తూ వెళ్లి సురేష్ ను ఆపాడు గిరి.

ఏమన్నట్లుగా చూసాడు సురేష్.

"ఏముంది పార్టీయే!" నవ్వాడు గిరి.

"పార్టీయా! అసలే ఎలారా భగవంతుడా కొత్తచోటుకు బదిలీ అని నేను గింజుకుంటుంటే!" నుదుటిపై కొట్టుకున్నాడు సురేష్.

"బాగుందోయ్... నీ బదిలీకి కాదు పార్టీ, నీ ప్రమోషన్ కు."

చేతిలోనున్న పూలదండను మరో చేతికి మార్చబోయి,

"సరే కాస్త తలవంచు." అని తను తెచ్చిన దండ గిరి మెడలో వేయబోయాడు.

"ఇదే చెవిలో పువ్వు పెట్టడం అంటే!" అంటూ దండను చేతికందుకుంటూ సురేష్ అన్న మాటలకు దంతధావనం ప్రకటనలా పళ్లన్నీ కనబడేలా నవ్వాడు గిరి.

"ప్రమోషన్ నాకొక్కడికేనా నాతోపాటు ఉన్నాడుగా మన కరుణాకరం." తనపై మాత్రమేనా ఈ దాడి అని కరుణాకరం పేరు గుర్తు చేసాడు.

"అక్కడ ప్రమాణస్వీకారం అయ్యాకే నీ వెంట పరిగెట్టా." పేల్చిన బాంబు ఎలా పేలుతుందా అని చూస్తున్నాడు గిరి.

"సరే ఇక తప్పేదేముంది, రేపు క్యాంటీనులో బిల్లు మాది. నీకొక్కడికే కాదు మన వాళ్ళందరికీ కూడా చెప్పు."

గిరి ఆనందంగా వెనుదిరిగాడు తనకందిన ప్రమాణాలు అందరికి చెప్పాలని.

బయలుదేరాల్సిన రోజు కాస్త దిగులుగా అనిపించినా భార్య సర్దిచ్చిన టమాటో పచ్చడి, ఆవకాయ, అరిసెలు, మురుకులు! చిన్నపిల్లలు హాస్టల్ కు వెళ్లినట్లుంది సురేష్ కు.

చేరాల్సిన ఊరు పల్లెటూరు. ఒకే ఒక హోటల్, అదీ రాత్రి తొమ్మిదయితే షటర్ వేసేస్తారు.

'ఇక్కడెవరు పెట్టారయ్యా ఇంత కంపెనీ మన దుంపతెంచడానికి,' అనుకుంటూనే చిన్నగా కొత్త వాతావరణానికి అలవాటు పడసాగారు.

'బాధ్యతల బరువులు తగ్గినట్లనిపించి కాస్త రిలీఫ్ గా వుందోయ్,' అని చెప్పుకోసాగారు అడపాదడపా. చక్కగా హోటల్ భోజనం, చిన్న గదులున్న ఇంటిలో దిగుల్లేని నిద్ర. హాయిగా ఒకరి కాలేజ కబుర్లు ఒకరితో కలబోసుకోవడం. పనిలో పనిగా ఇంటిగురించి గుర్తు వచ్చినా, 'సగం జీతం పంపాముగా మ్యానేజ్ చేసేస్తారులే మనమైతే హమ్మ... హమ్మ... ఎన్ని కోరికలు, ఎన్ని లిస్టులు. మా వాడైతే రోజుకొక టెన్నిస్ ర్యాకెట్ అని చంపేవాడు' అని కరుణాకరం, 'కూరగాయల లిస్టు, మందుల లిస్టు, సరుకులు... సరంజామా ఒకటేమిటి పాలబిల్లు, కరెంటు, నీళ్ళ బిల్లు అన్నీ మనమే, వీళ్లేమో టి.వి లకు మహరాణి పోషకులు.' ఇలా ఇంటి సంగతులు చెప్పుకుని నవ్వుకునేవారు.

'ఇంత స్వేచ్ఛ అనుభవించి ఎన్నాళ్ళయింది! మళ్ళీ టీనేజి రోజులు వచ్చినట్లుంది.' అని సంబరపడ్డారు.

కాని సంబరానికి ముగింపు మరోలా వుంది మరి. అది కడుపులో గుడగుడతో మొదలయింది ఇద్దరికీ. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. అర్ధమయినట్లు తలపంకించాడు సురేష్.

తరుణోపాయం ఆలోచించాడు. అదే స్వయంపాకం.

చిన్న చిన్న షాపులలో కావలసిన సరుకులు వెతకి లిస్టు రాసుకుని, వాళ్లు రాసుకున్నవి కాక షాపువాడు తెలివిగా అంటకట్టినవి వెరసి చాంతాడంత లిస్టుతో సామాను ఇంటికి తెచ్చుకుని సర్దుకోలేక కాసేపు పడకేసారు ఆదివారమే కదా అని.

లేచేసరికి చీమల బారులు. వాటి కసితీరేదాకా మిత్రులిద్దరు కుట్టించుకున్నాక కాని పంచదార స్థావరాన్ని వదిలివెళ్లలేదు... మళ్లీ ఖాళీ డబ్బాలకోసం పరుగు.

బల్లపై ఫైళ్ళు తరగడం లేదు కాని తెచ్చివుంచిన కూరగాయలు పాడవుతాయని తరగడం ఎలా అనే ఆలోచనలెక్కువయాయి. ఇంటి ఓనరు పంపు కట్టేసేలోపు నీళ్లు పట్టుకోవాలి, పాలు కాచాలి, తోడుపెట్టాలి. చల్లారితే తోడుకోవు, వేడిగా తోడేస్తే పెరుగు కాదు విరుగు తయారవుతోంది.

"నిజమే మన వాళ్ళు మనకన్నీ అమరుస్తుంటే తెలియలేదు." విచారంగా అన్నాడు సురేష్.

దొండకాయ వేపుడు ఇష్టమని తెచ్చుకున్న దొండకాయలను, 'ఇవి బండకాయలు ఎన్ని తరిగినా తరగవు' అనుకుంటూ వంగిన వీపును విరుచుకుని నిలబడి దొండకాయలపట్ల విరక్తిగా చూస్తూ, "నిజమే!" అంటూ నిట్టూర్చాడు కరుణాకరం.

"మనకిది ఉద్యోగ బదిలీలా లేదు వంట బదిలీలా వుంది." అని తమపై తామే జోకులేసుకుంటూ, విరామమెప్పుడు దేవుడా అని ఎదురు చూస్తే సంక్రాంతి సెలవులు పలకరించాయి.

ఇంకేముంది? సంక్రాంతి దొరికిన సెలవులకు హాస్టలు కుర్రాళ్ళలా ఇండ్లకు పరుగులు పెట్టారు మిత్రద్వయం.



సంయుక్త బాధతో మెలికలు తిరిగింది... కడుపులోంచి వస్తున్న కేకని తన చేత్తో నోటిపై పెట్టి ఆపేసింది. దగ్గర్లోవున్న బాటిల్ను అందుకుంది. అందులో నీళ్ళు లేవు... రాత్రే తాగేసింది. ఆమె శారీరక బాధను అధిగమిస్తూ మనసు బాధతో మూల్గింది. కష్టసమయంలో తనకెవరూ లేరన్న వేదన ఆమెను కన్నీళ్ళ పర్యంతం చేసింది. ఇంకెన్నాళ్ళు భరించాలి? ఇంకా ఎంతుంది జీవితం? ఎప్పుడు ముగుస్తుంది ఈ పోరాటం? ఈ ఒంటరితనం, ఈ నిస్సహాయత... ఈ ఆర్తి...! కళ్ళ కొనలనుండి కన్నీరు ధారాపాతంగా జారిపోయాయి.

ఆది నుండి ఎన్నోవేల, లక్షల, కోట్ల స్త్రీల ఆత్మ ఘోషలు ఆమెకు వినపడసాగాయి. ప్రేమ, ఆదరణ, ఆనందం, తృప్తి, గౌరవం కోసం స్త్రీలు సాగించిన మౌన పోరాటంలో విజేతలు లేరా? ఆమె ఆత్మ కూడా ఆమె శరీరం నుండి విడివడి విముక్తి పొందాలని కోరుతోంది బంధనాల నుండి, బంధాల నుండి; కనపడని సంకెళ్ళ లో బందీగా, స్వేచ్ఛ వున్నా తీసుకోలేని, రెక్కలున్నా ఎగరలేని, చదువున్నా చైతన్యం లేని, అందం వున్నా ఆనందించలేని, ఆమె, అనంత సముద్రం ముందు ఎండిన గొంతుకతో కొట్టు మిట్టాడుతోంది. ఆమెకు తెలుసు సముద్రం నీళ్ళు దాహం తీర్చవని అవి త్రాగితే మరింత దాహం ఆవరిస్తుందని, ఆమెకు కావాల్సింది చల్లని నీరిచ్చే చెలిమ. అదెక్కడుంది?.

ప్రశాంతమైన ఆ రాత్రి అల్లకల్లోలంగా వున్న ఆత్మల విన్యాసం ఆమెకు లోచ సాగింది. ఓల్గా నుండి గంగ వరకు ప్రయాణించిన ఆదిమజాతి స్త్రీ, కసిగా శత్రు వర్గపు పసిబిడ్డను రాతి కేసి బాది చంపినప్పుడు ఆమెలో కల్గిన వేదన నుండి ఈనాటి ఆసిడ్ పడ్డ ముఖాన్ని అద్దంలో చూసుకునేందుకు భయపడే అమ్మాయి వరకు, ఆక్రందనలు, అశ్రు సంగీతాలు, మౌన రోదనలు అదిమి పట్టిన కన్నీళ్లు. ఎందుకు శపించరు నీచులైన మానవజాతినంతా ఈ అభాగ్యులు? ఎందుకు ఉపయోగించరు స్త్రీలు తమ తపశ్శక్తిని మృగాన్ని మరిపించే మగజాతిని నిర్వీర్యం చేయడానికి? ఎందుకు ముంచరు తమ కన్నీటి వరద లో మోసంనేర్చిన మగ అహంకారులను? ఎందుకు భస్మం చేయరు తమ కోపాగ్నిలో? ఎందుకు ద్రోహం చేసే ఈ జాతికి ప్రేమనే పంచుతారు, విధేయులై తలలు వంచుతారు? తమ మాతృత్వాన్ని, సౌభాత్రుత్వాన్ని, ఆడతనాన్ని ఎగతాళి చేసే మగవారి పట్ల ఎందుకు కనికరం చూపుతారు? ఆమె ప్రశ్నించుకుంది. ఆమెకు తెలియదు తనేమి చేసిందో! స్త్రీ అస్తిత్వమే ప్రేమ పంచడం! సహజమైన ఆ గుణం నుండి ఆమె తనను తాను వేరు చేసుకోలేదు. అదే శక్తి ఆమె కుంటే, ఎందుకు ఎన్ని భగ్నమైన జీవితాలు చూసినా తన ప్రేమ సత్యమని, నిత్యమని నమ్ముతుంది? ప్రతి స్త్రీకి మోసపోయేంత వరకు ప్రియుడు అమర ప్రేమికుడే! ఎవరికీ జరిగినా తనకు అలాగా జరగదని... తనకున్న ప్రత్యేకతలు తమ ప్రేమను జీవితం కడవరకు జీవింప చేస్తాయని అనుకుంటుంది. ఆమెకు తన కూతురు గుర్తు వచ్చింది... పాము పడగ నీడ పడకుండా పాపని కాపాడడానికి కన్న ప్రేమను కూడా చంపుకుంది ఎక్కడో దూరంగా తల్లి దండ్రుల దగ్గర ఉంచింది. తాను లక్ష్మణ రేఖ దాటిన ఫలితాన్ని అనుభవించింది. తల్లి దండ్రులకు తెలియకుండా ప్రేమ మత్తులో తప్పు దారి నడిచింది. ప్రేమించిన వాడు మోజు తీరగానే యముడైనాడు... త్రాగుడు, జూదం, వ్యభిచారం అతన్ని నిత్యం పెనవేసుకుని వుంటాయి. అతను కట్టిన తాళి, చేసిన ప్రమాణాలు అన్నీ బూటకాలు. అతి తొందరలోనే అతని దుర్వసనాలకు సంయుక్త వంటి పై బంగారం ఆవిరయింది. ఆమెకు మోసపోయానని అర్థమయింది. సరైన ఆహారం, పోషణ లేక ఆమె శరీరం రోగ గ్రస్తమయింది. ఇలాగే వుంటే మరణం అతి చేరువలో ఉందని అర్థమయింది. చివరిసారిగా తన పాపని చూడాలనుకుంది. దాదాపు ఐదేళ్ళ క్రిందట తన పరిస్థితి మెరుగు పడదనుకున్న తర్వాత పాపని తీసుకుని అమ్మానాన్న దగ్గరకు వెళ్ళింది. శిథిలమైన ఆమె జీవితాన్ని,సౌందర్యాన్ని, శరీరాన్ని చూసిన తల్లితండ్రులు ఏడ్చారు. ఒక్కగానొక్క కూతురెందుకలా చేసిందో,

అడిగినా ఆమె నుండి జవాబు లేదు. సంవత్సరం బిడ్డను వాళ్ళకు అప్పగించి చెప్పకుండా వచ్చేసింది. బిడ్డ ఏమయ్యింది అని కూడా అతను ప్రశ్నించలేదు.

డిగ్రీ చదివినా సర్టిఫికేట్ లేని కారణంగా ఏ ఉద్యోగ ప్రయత్నం చేయలేకపోయింది. అతని వుద్యోగం కూడా పోయాక ఇంక ప్రత్యక్ష నరకం మొదలయ్యింది. అతనింట్లో కూడా వుండడం లేదు. ఎక్కడికి వెళతాడో ఏమిచేస్తాడో, ఎప్పుడొస్తాడో కూడా తెలియదు. నెమ్మదిగా లేచింది. శక్తినంతా కూడగట్టుకుని ఇల్లంతా వెతికింది. వూరికి వెళ్ళడానికి కావలిసిన డబ్బు కోసం అమ్మదగిన వస్తువు ఏదీ కనపడలేదు. వంటి పైనున్న బంగారం అంతా అతను హరించాడు. నిరాశగా కూలబడుతూ ఎదురుగా వున్న అద్దం లోకి చూసింది. ముక్కు పై మిలమిల మెరుస్తూ ముక్కు పుడక కన పడింది. అంత విలువైనది కాదని అతను పట్టించుకోకపోవడం వల్ల అది మిగిలింది. పరీక్షగా అద్దంలో తన మొహాన్ని చూసుకుంది."నీ ముఖంలోని అందమంతా నీ ముక్కులో ఉందోయ్, షార్ప్ గా ఎంత బాగుంటుందో! దానికి తోడు ఆ ముక్కుపుడక మరీ బాగుంటుంది" అనేది తన స్నేహితురాలు వందన. నిజమే తన ముక్కు చాలా బాగుంటుంది ఇప్పటికి బాగుంది... కానీ బుగ్గలే జారిపోయాయి. ముప్పై ఏళ్లకే తన సౌందర్యం మాసిపోయింది. వందన మాటలు ఆమెకు పదే పదే గుర్తుకొచ్చాయి. ఒక్క సారి చిరునవ్వు మెరిసింది ఆమె పెదాలపై. అద్దంలో మరొక్కసారి చూసుకుంది ఆమె వదనాన్ని. పొడుగ్గా వున్న ముక్కుని, ధగ దగా మెరిసే వజ్రం ముక్కు పుడకని, మళ్ళీ మళ్ళీ పెదవులపై చిరునవ్వు రాసాగింది. రోజుకు ఒక్కసారైనా నవ్వలేకపోవడం ఎంత దురదృష్టకరం ? వందన తన ముక్కు అందాన్ని గురించి అన్న మాటలు గుర్తొచ్చి, ఆమె లో కొత్త ఉత్సాహాన్ని... జీవితం పై ఆశని నింపాయి. కడుపు నొప్పి తో రాత్రి పడ్డ నరకయాతన కూడా ఆమెకు గుర్తు రాలా!

పదేళ్ళ క్రిందట తను వూరు విడిచి వచ్చేప్పటికి వందన మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతోంది, అంటే ఇప్పుడు ప్రాక్టీసు చేస్తూ వుంటుంది. వందన దగ్గరికి వెళ్ళాలి. వందన ఎక్కడుందో కనుక్కోవాలి. ముందు వందనతో మాట్లాడాలి... చెడి స్నేహితుల ఇంటికే వెళ్ళ మన్నారు. దగ్గరలో వున్న ఇంటర్నెట్ సెంటర్ కి వెళ్ళింది. పక్కింటి అమ్మాయి సుమతి అక్కడ పనిచేస్తుంది.

"సుమతీ ఇంటర్నెట్ ద్వారా నా క్లాస్మేట్ డాక్టర్ అంకిరెడ్డి వందన గురించి తెలుసుకోవడం సాధ్యమా!" అని అడిగింది.

"గంటలో కనుక్కోవచ్చు లెండి నేను ప్రయత్నిస్తాను కూర్చోండి"అంది.

వందన చదివిన మెడికల్ కాలేజ వివరాలు, మిగతా వివరాలు చెప్పింది. అర్ధగంటలో వందన ఫోన్ నంబరు, హైదరాబాదులో క్లినిక్ వివరాలు, లాండ్ లైన్ నంబరు, సుమతి కనుక్కుంది. తన సెల్ నుండి వందనకు కాల్ చేసి ఇచ్చింది. రింగ్ అవుతున్నా, రెండు మూడు సార్లు చేసినా తీయలేదు. మళ్ళీ మళ్ళీ చేసి నిరాశగా "తీయడం లేదక్కా"అంది.

"పర్లేదులేమ్మా... నంబరు మారిందో లేక వాళ్ళది కాదో... మళ్ళీ ప్రయత్నం చేద్దాం లే " అని ఇంటికి వచ్చేసింది.

కాని ఎందుకో సంయుక్త కు నిరాశగా లేదు. ఏదో ఆశ ఆమెలో మొలకెత్తింది. వున్న బట్టల్లో మంచివి తీసి సర్దుకుంది. కడుపులో నొప్పి మొదలైంది ఎప్పుడో డాక్టర్ రాసిచ్చిన టాబ్లెట్లు కొనుక్కుని వేసుకుంది. సుమతి దగ్గరకు వచ్చి "సుమతి చిన్న సాయం కావాలి" అంది. "చెప్పక్కా..." అంది. సుమతి. రెండేళ్లుగా ఆమె ఎవర్ని ఏమీ అడగడం చూడలేదు అతను తాగి వచ్చి గొడవ చేసినా ఆమె బయటికి వచ్చేది కాదు. చుట్టు ప్రక్కల వాళ్లకి ఆమెంటే ఎంతో గౌరవం సానుభూతి వున్నాయి.

"ఈ ముక్కుపుడక అమ్మి వద్దామా... నాకు ఎక్కడ అమ్మాలో తెలియదు" అంది. "మీకు... ఆ ముక్కుపడక చాలా బాగుంది అయినా దానికెంత వస్తుంది? చెప్పండక్కా... నేనేమైనా సహాయంచేయగలనా?"అంది

"లేదమ్మా... నేను మా వూరు వెళతాను... డబ్బు కావాలి, ఇది వజ్రం." అంది.

"సరే అక్కా సాయంత్రం వెళదాం లే" అంది సుమతి.

సాయంత్రం అడిగితే సుమతి ని "రేపు వెళదాం అక్కా పనుంది" అంది. ఆమె మళ్ళీ ఆలోచించింది... ఎంతలేదన్నా ముక్కు పుడక్కి పదివేలు వస్తాయి. అప్పుడెప్పుడో పదిహేనేళ్ళక్రిందట అది మూడువేలు అయింది. ఈ ఊరిని, నరకాన్ని గుర్తు చేసే అతన్ని విడిచి వెళ్లి పోతే... ముందు డాక్టర్ కు చూపించుకుంటే... ఆరోగ్యం కుదుట పడితే... ఏ పని చేసుకోరాదు? అమ్మానాన్న దగ్గరికి వెళితే తప్పేంటి? తప్పు చేసినవాళ్ళు ఎప్పటికి ఇలా శిక్ష అనుభవిస్తూనే ఉండాలా! అమ్మా నాన్నా... పాప... గుర్తొచ్చారు. ఆమె కళ్ళలో కన్నీళ్ళు తిరిగాయి దుఃఖంతో కాదు. ఒక రకమైన ఉద్వేగంతో!

ఎవరో మోసం చేస్తే దురదృష్టాన్ని తిట్టుకుంటూ... కృంగిపోవాల్సిందేనా! ఎవరి తోటి చెప్పుకోక, ఎవరి సహాయం తీసుకోక ఈ నరకం లోనే మ్రగ్గి పోయింది చాలు... ఇంక క్రొత్త గా ఆలోచించాలి. భయంకరమైన గతాన్ని సమాధి చేయాలి. సంయుక్త ప్రశాంతంగా నిద్రపోయింది.




"మమ్మీ! అన్నయ్య కొట్టాడు" అని ఏడ్చుకుంటూ వచ్చిన కిరణ్ ని దగ్గరకి తీస్కుంటూ "హర్షా ఇలారా" అని కోపంగా పిలిచింది నీరజ. 'ఏంటి మమ్మీ?' అని దూరం నుంచే భయంభయంగా అడుగుతూ మూలగానిలబడ్డాడు హర్ష. "ఎందుకురా వాణ్ణి కొట్టావు. చిన్నవాడు కదా ఏదయినా తప్పుపని చేస్తే నాకు చెప్పమన్నానా లేదా, గుంజీళ్ళు తియ్యి ముందు" అని కసిరింది నీరజ.

"వాడేం చెప్పినా వింటావు నామాట అస్సలు విన్పించుకోవేం?" విసుగ్గా అన్నాడు హర్ష. "నా నోట్సు మీద ఇంకు వొంపేశాడు రేపు క్లాసులో టీచరు అడిగితే ఏం చెప్పాలి?" అందుకే కోపం వచ్చి చెంపమీద ఒక్కటిచ్చాను" అన్నాడు చేతులు తిప్పుతూ.

"వాడికి అందేలా ఎందుకు పెట్టావు? ఎనిమిదో క్లాసుకి వచ్చావు ఇంకా జాగ్రత్త రాకపోతే ఎలా? అయినా కిరణ్! నోట్సు మీద ఇంకు ఒంపాల్సిన పనేంట్రా బుర్రాబుద్ధీ లేదా?" అని చిన్నవాణ్ణి కూడా మందలించింది నీరజ. "నేను కావాలని ఒంపలేదమ్మా. ఇంకుపిల్లర్ నుంచి ఇంకు ఎలా పడుతుందో టెస్ట్ చేద్దామనుకున్నా. కిందపడితే గట్టు పాడవుతుందని నువ్వు తిడతావుగా అక్కడేదో నోట్సు ఉంటే దానిమీద డ్రాప్స్ లాగా వేసాను. భలే డిజైన వచ్చింది. నాకేం తెల్సు అది అన్నయ్య నోట్సని" కళ్ళు అమాయకంగా పెట్టి

చెప్పాడు కిరణ్. "అంటే నీ డిజైన్లకి నా నోట్స్ దొరికిందా? నాలుగో క్లాసు చదువుతున్నావు ఇంకా బుద్ధి రాలేదు?" అన్నాడు హర్ష తల్లిని అనుకరిస్తూ.

"సరేసరే. గొడవలు ఆపి భోజనానికి రండి" అంది నీరజ. కంప్యూటర్ ముందు నుంచి లేస్తూ. "అమ్మా, నాకు తినిపిస్తేనే తింటా" అన్నాడు గారంగా కిరణ్. "సర్లే, రోజూ ఉండేదేగా! నీకిష్టమని పొటాటో ఫ్రై చేశా" అంది ముద్ద కలిపి నోట్లో పెడ్తూ.

"మమ్మీ మమ్మీ నాకూ తినిపించవా?" ఆశగా అడిగాడు హర్ష తల్లిని. "ఇంకా నయం! నువ్వేమన్నా చిన్నపిల్లవాడివా? బుద్ధిగా కలుపుకుని తిను" అంది గద్దిస్తున్నట్లు. "అంతే! కిరణ్ కి తినిపిస్తావు గాని నేనడిగితే మాత్రం విసుక్కుంటావు నీకు వాడంటేనే ఇష్టం" అని కోపంగా ప్లేట్ పట్టుకుని తన రూమ్ లోకి వెళ్లిపోయాడు హర్ష. తనలో తాను నవ్వుకుంది నీరజ హర్ష ధోరణికి.

రాత్రి పిల్లల్ని నిద్రపుచ్చుతూ అనునయంగా చెప్పింది నీరజ "ఇద్దరూ కలిసి మెలిసి వుండాలి ప్రతి చిన్నదానికి కొట్టుకోవడం, తిట్టుకోవడం మంచిది కాదు. అంతా నవ్వుతారు అలా చేస్తే, నీకంటే తమ్ముడు చిన్నవాడు కదా వాడేమన్నా చేస్తే నాకుగాని డాడీకి గాని చెప్పాలి. అంతేకాని కొట్టకూడదు" అంటుండగానే "నాకే చెప్తావు అన్నీ. వాడికేం చెప్పవేం?" అని కయ్యిమన్నాడు హర్ష. "ఏం చెప్పమంటావు" అంది నవ్వాపుకుంటూ నీరజ.

"అదే! అన్నయ్య పెద్దకదా వాణ్ణి విసిగించకు, వాడి వస్తువులు ముట్టుకోకు. అని చెప్పవచ్చుగా" అన్నాడు ఆరిందాలా "ఎందుకు చెప్పను? నీకు చెప్పినట్లే వాడికీ చెప్తాను, కిరణ్! అన్నయ్య నిన్నేమన్నా అంటే నాకు చెప్పు" అంది నీరజ. "నేనెందుకు అంటాను? నన్నేమైనా అంటేనే కదా? వాడికే నువ్వు సపోర్టు ఎప్పుడూనూ, ఛీ!" అన్నాడు ఉక్రోషంగా హర్ష. "అబ్బ, పోన్లేరా నువ్వంటే నాకు చాలా ఇష్టం. నా పెద్దకొడుకువి కదా! ఇద్దరూ గుడ్ బాయ్స్ సరేనా? ఇంక పడుకోండి" అంది దుప్పటి కప్పుతూ.

******

"ఇదిగో చూసారా, హర్ష బ్యాటుతో కిరణ్ణి కొట్టాడు. రోజురోజుకి వాడి ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మీరు కాస్త కలగజేస్కోండి." అంది నీరజ అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి రిలాక్సవుతున్న భర్త కృష్ణతో. "ఇంతకీ కిరణ్ ఏం చేసాడో?" అడిగాడు సాలోచనగా. "ఏం చేసినా కొట్టాల్సిన పనేంటి? మనకి చెప్పాలి కదా" అంది కోపంగా. "ఒకసారి అటుచూడు" అన్నాడు కృష్ణ. కిటికీ లోంచి

బయటి దృశ్యం చూసి ఆశ్చర్యపోయింది నీరజ. కిరణ్ ఫైవ్ స్టార్ అన్నకి ఆప్యాయంగా అందిస్తుంటే హర్ష వాణ్ణి సైకిల్ మీద కూచోపెట్టుకుని ఇంటి చుట్టూ రౌండ్స్ వేస్తున్నాడు. "పిల్లలన్నాక కాసేపు కొట్టుకోవడం, తిట్టుకోవడం, తర్వాత మర్చిపోయి ఆడుకోవడం మామూలే నీరూ! అంత పట్టించుకోవాల్సిన పనిలేదు" అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో కృష్ణ. "ఏమో బాబూ ఎవరికి చెప్పలేను" అంది నిట్టూరుస్తూ నీరజ.

******

"ఏమండీ ఇవాళ మీ అన్నయ్యగారబ్బాయి వస్తున్నాడు గుర్తుందా? స్టేషన్ కి వెళ్ళాలేమో" కారియర్ అందిస్తూ అంది నీరజ. "ఆ... అవును సాయంత్రం ట్రైన్ కదా. నేను ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు పికప్ చేస్కుంటాలే" అని వెళ్ళిపోయాడు కృష్ణ.

రాత్రి అంతా కల్సి భోజనాలు చేస్తుంటే కుశల ప్రశ్నలు అయ్యాక "ఏరా మధూ, మీ అన్నయ్య రవి ఎలా వున్నాడ్రా? ఈ మధ్య వస్తాడా ఇండియా?" అని ప్రశ్నించాడు కృష్ణ " వచ్చేనెల వస్తాడట బాబాయ్ నాకు నెలనెలా పాకెట్ మనీ పంపిస్తాడు. మొన్నామధ్య తన ఫ్రెండ్ ఎవరో హైదరాబాద్ వస్తోంటే నాకు జీన్స్, షూస్ పంపాడు. ఎంత బాగున్నాయో? మా ఫ్రెండ్స్ అంతా ఎంత పొగిడేసారో తెల్సా మా అన్నని. ఈసారి ఐపాడ్ తెస్తాట్ట నాకోసం! తనకీ బోలెడు అవసరాలుంటాయి కదా నాకేం పంపద్దు అన్నా వినడు. ఆ దేశంలో ఖర్చులెక్కువ కదా అందుకే నాకేం వద్దంటాను". అన్నాడు ఇంజనీరింగ్ చదువుతున్న మధు.

"బాగుందిరా అన్నదమ్ములంటే అలా వుండాలి. చూడండ్రా అన్నయ్యలు ఎంత సఖ్యతగా ఉన్నారో? మీలా అస్తమానం కొట్టుకోరు. నేర్చుకోండి" అన్నాడు కృష్ణ పిల్లలతో. "వాళ్లింకా చిన్నపిల్లలు బాబాయ్! బాగానే ఉంటార్లే... వాళ్లకేంటి?" అన్నాడు హర్ష తలనిమురుతూ. హర్ష ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు. వారం రోజుల్లో మధు తన ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

******

ఆదివారం... అంతా బీచ్ కి వెళ్లారు. కృష్ణ కిరణ్ణి తీస్కొని ఐస్ క్రీమ్ తేవడానికి వెళ్ళాడు. హర్ష తల్లితో ఇసుకలో నడుస్తూ "రవన్నయ్య ఎంత మంచివాడో కదా మమ్మీ! చాలా గ్రేట్. మధన్నయ్యకి ఎన్ని కొనిపెడుతున్నాడోనే! మధన్నయ్య హేపీ! ఏం

కావాలన్నా పేచీ పెట్టక్కర్లేదు అన్నీ పెద్దన్నయ్య కొనిస్తాడు కదా!" అన్నాడు కెరటాల్ని తదేకంగా చూస్తూ.

వాడి మనసులో విషయం కనిపెట్టినట్లు కవ్వింపుగా "నీకూ అలాటి అన్నయ్య వుంటే బాగుండు అన్పిస్తోంది కదా! నీక్కావలసినవన్నీ కొనిపెడ్తూ ఉంటే ఎంత బాగుంటుందో కదా?" అంది నీరజ.

"లేదమ్మా నాకూ తొందరగా చదివేస్కోని, పెద్దవాణ్ణయిపోయి అన్నయ్యలాగా పెద్ద ఉద్యోగం తెచ్చేసుకుని తమ్ముడికి అన్నీ కొనిపెట్టాలని ఉంది. అప్పుడు తమ్ముడు కూడా మధన్నయ్యలా హేపీగా ఉంటాడు కదా!" అన్నాడు ఆశావాదంతో మెరుస్తున్న కళ్ళతో.

ఆశ్చర్యంగా వాణ్ణి చూస్తూ ఉండిపోయింది నీరజ. వాడు తమ్ముడు స్థానంలో వుండాలని ఆశపడుతున్నాడేమో అనుకుంది కాని వాడు అన్నగా తమ్ముణ్ణి ఎలా సంతోషపెడదామా అని ఆరాటపడుతున్నాడు.

'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేనే లేదని' ఏనాడో అని ఒక మహాకవి ఎంత బాగా వ్రాసాడో కదా? నిజమే, నిజమైన ఆనందం కోసం ఎక్కడెక్కడో వెతుకుతూ ఉంటాం, కాని ఇతరులకి మనస్ఫూర్తిగా ఇవ్వడంలో, సాయం చేయడంలోనే కదా అసలైన ఆనందం దాగివుంది! ఇంత చిన్న వయసులోనే తన కొడుకు ఆ ఆనందాన్ని అంది పుచ్చుకోవాలనుకోవడం ఆమెకి చాలా ఆనందంగా అన్పించింది.

"అన్నయ్యా ఇదిగో ఐస్ క్రీమ్...! నీ కిష్టమైన బటర్ స్కాచ్... నేనే చెప్పా డాడీకి ఇది నీ ఫేవరేట్" అని అన్న చేతిలో పెట్టాడు. "థాంక్యూ రా కిరణ్" అంటూ ప్రేమగా వాడి భుజమ్మీద చెయ్యి వేస్తున్న హర్షని హర్షాతిరేకంగా చూస్తూ వుండిపోయింది నీరజ.




ఆనందరావు ఆనందానికి అంతులేదు. పదే పదే కాలెండర్ వైపు చూడసాగారు. పార్వతమ్మ ముసి ముసి నవ్వులతో భర్తని ఓరగా గమనించసాగింది. వారి ఏకైక కుమారుడు ధీరజ్ వచ్చేవారమే అమెరికా నుంచి సపరివార సమేతంగా స్వదేశానికి తిరిగి వస్తున్న శుభ వర్తమానాన్ని టెలిఫోన్ అందించింది మరి ఇందాకే, ఇద్దరూ హడావిడి మొదలుపెట్టారు.

"పార్వతీ! అబ్బాయి శుక్రవారమే కదా వచ్చేది వాడికి ఇష్టమైన వంటకాలతో స్వాగతం చెప్పాలి తెల్సిందా, ఈలోపు బజార్నించి ఏమేం తేవాలో లిస్ట్ ఇద్దూ", అంటూ బట్టలు మార్చుకొని స్కూటర్ తాళాలు అందుకున్నారు. "అబ్బ, ఇంకా వారం వుందండి. ఈ లోగా మనవడికి బంగారుగొలుసు, కోడలికి పట్టుచీర, బాబుకి మంచి సూటు కొనాలి ఆ పని చూద్దాం ముందు బ్యాంకుకు వెళ్ళాలి" అని ఆవిడ తొందరపెట్టింది.

ఈ విధంగా కొడుకు స్వాగత కార్యక్రమాలు చురుకుగా మొదలుపెట్టారు భార్యాభర్తలు, ఆనందరావు పెద్ద ప్రయివేటు ఫర్మ్ లో క్లర్క్ గా జీవితం మొదలుపెట్టి అంచెలంచెలుగా మేనేజర్ స్థాయికి ఎదిగిన వ్యక్తి, భార్య పార్వతి యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్

స్టూడెంట్. వారిద్దరూ క్లాస్ మేట్స్ ప్రేమించి పెళ్ళి చేసుకుని ఆధునిక భావాల్ని మనసు నిండా పుష్కలంగా నింపుకున్న జంట. ఆమె స్కూల్ టీచర్ గా జీవితాన్ని ప్రారంభించి ప్రొఫెసర్ గా రిటైరయ్యింది. వాళ్ళ ఏకైక పుత్రరత్నం ధీరజ్. ఎమ్. ఎస్ చేసి తల్లిదండ్రుల అభిరుచులకి తగినట్లున్న అమ్మాయిని పెళ్ళిచేసుకుని అమెరికాలో సెటిలయిన యువ ఇంజనీర్, 5 సంవత్సరాల అనంతరం తల్లిదండ్రులని చూడ్డానికి ఇండియా వస్తున్నాడు.

****     ****     ****     ****

శుక్రవారం రానే వచ్చింది ధీరజ్, రాణి, బంటి ఉత్సాహంగా అమెరికా విశేషాలు దారి పొడుగునా కథలుగా వర్ణిస్తున్నారు. ఆనంద్, పార్వతి వాళ్ళు చెప్పేది శ్రద్ధగా వింటున్నారు. టాక్సీ ఇంటి ముందు ఆగింది. సామాన్లు లోపల పెడుతుంటే ధీరజ్ తల్లితో "అమ్మా! మీ ఇద్దరికీ కొత్తకారు బుక్ చేద్దామనుకుంటున్నాను. ఇంకా స్కూటర్ ఏంటి నాన్న ఈ వయసులో అన్నాడు.

'ఎందుకురా? మా ఇద్దరికీ, స్కూటర్ చాల్లే, పదపద స్నానాలు కానిచ్చి భోజనాలు చేద్దురు' అంటూ లోపలికి దారి తీసింది పార్వతి.

ఒక కునుకు తీసి సాయంత్రం అలా షికారుకు వెళ్లారు తండ్రీ కొడుకు, మనవడు. వంటగదిలో అత్తగారికి సాయంచేస్తోంది రాణి "అత్తయ్యగారు! అమెరికాలో దేనికీ కొరతలేదంటే నమ్మండి ఎంతో హాయిగా ఉంది తెల్సా" అంది రాణి కూరలు తరుగుతూ.

"అవును రాణీ! కాని పనిమనుషులు ఉండరని, పన్లన్నీ మనమే చేసుకోవాలని, ఫాస్ట్ లైఫ్ అని అంటారే." అడిగింది పార్వతి ఆశ్చర్యంగా.

"నిజమే కాని అలా అన్పించదస్సలు అత్తయ్య! ఆయన ఉద్యోగానికి వెళ్ళిపోతారు. బాబు స్కూల్ కి వెళ్ళిపోతాడు అందరం తలా ఒక పని చేసుకుంటాం బస్, పనీ త్వరగానే తెమిలిపోతుంది. అన్ని పన్లకి మిషన్స్ ఉన్నాయి. ఎవరి మీద ఆధారపడ్డం గాని, పని మనుషుల కోసం, చాకలి కోసం ఎదురుచూడ్డం గాని ఏవీ ఉండవంటే నమ్మండి. అక్కడ మనుషులు కూడా చాలా కలివిడిగా, స్నేహంగా ఉంటారు. మనవాళ్ళు అక్కడ ఎక్కువగానే ఉన్నారు. వీకెండ్స్ లో పార్టీలు అవుతూ ఉంటాయి. గెట్ టు గెదర్స్ అవీ తెలుగువాళ్ళం అందరం ఒక దగ్గర చేరతాం. భోజనాలు, సంగీత కచేరీలు, నాటకాలు చాలా సరదాగ ఉంటుందండీ. మీ వయసువాళ్ళు, మీలాగే రిటైరైన వాళ్ళు, పిల్లలతో అమెరికా వచ్చి సెటిలయిపోయినవాళ్ళు చాలామందే ఉన్నారు. నాకయితే

మీరు మామయ్య మాతో వచ్చేస్తే బాగుండును అన్పిస్తుంది. ఎక్కడ ఎవరున్నారు? మీరు రిటైరయిపోయారు కూడా కదా, మాతో వచ్చేయండి" అని ప్రేమగా అడిగింది రాణి.

పార్వతి పొంగిపోయింది కోడలి అభిమానానికి నిజానికి ఆవిడకి మనసులో కొడుకు దగ్గర ఉండాలని వుంది. భర్త దగ్గర చెప్పకపోయినా ఎప్పుడూ అదే ఆలోచన. ఒక్కగానొక్క కొడుకు చిన్నప్పుడు ఉద్యోగ నిర్వహణలో పడి వెనకా ముందు ఎవరూ లేకపోవడంతో వాణ్ణి ఆయాలమీద, హాస్టల్స్ లో ఉంచి చదివించడంతో కొడుకుని చాలా మిస్సయ్యానని ఎన్నోసార్లు ఆమె బాధపడింది. అదే మాట ఆవిడ ఆనందరావుని నిద్రపోయేటప్పుడు అడిగింది.

"ఏమండీ! ఒకమాట అడగనా,

"ఏంటి పారూ" అన్నారు ఆనంద్.

"మరేంలేదండీ, 4 నెలల క్రితం నేనూ రిటైరయిపోయాను. మనిద్దరం ఖాళీయే. ఇక్కడ మనకి ఆస్తులు గాని, బాధ్యతలు గాని ఏమీ లేవు. ధీరజ్ దగ్గరికి వెళ్ళిపోదామండి. రాణి కూడా రమ్మంటోంది," అని గోముగా అడిగింది.

"నిజమేలే? వాడేమంటాడో, ఇవాళ్ళే కదా వచ్చారు. అన్నీ కనుక్కొని తర్వాత మాట్లాడదాం" అని నిద్రకి ఉపక్రమించారు.

****      ****      ****      ****

"రాణీ! ఎంతసేపు? ఇంకా తెమల్లేదా?" విసుక్కుంటూ అరిచాడు ధీరజ్.

"అబ్బ వస్తున్నానండీ బంటి ఎక్కడికో ఆటలకి వెళ్ళాడు ఇంకారాలేదని చూస్తున్నా" అని చీర కుచ్చెళ్లు పెట్టుకుంటూ సమాధానమిచ్చింది రాణి. "అబ్బాయికి కాఫీ ఇవ్వమ్మా"      అని కప్పు రాణి చేతికిచ్చింది పార్వతి.

"అమ్మా! ఇదిగో నీకోసం డైమండ్ నెక్లెస్, నాన్నకి డైమండ్ రింగ్, మీరు తిరగడానికి టాటా కారు వచ్చేవారం మన ఇంటి ముందుంటుంది. ఇందాక నా ఫ్రెండ్ బిల్డర్ ఒకడున్నాడు. వాడితో మన ఇంటిని మోడరన్ గా రీమోడల్ చేయడానికి ఎస్టిమేషన్ మాట్లాడాను. 6 లక్షలు అవుతుందన్నాడు. నేను రెండు దఫాలుగా పంపిస్తాను మీ టేస్ట్ కి తగినట్లు ఇంటిని రీమోడల్ చేయించుకోండి అని ఆపకుండా మాట్లాడుతున్న కొడుకుని విస్మయంగా, చూస్తూ వుండిపోయారు ఆనంద్, పార్వతి.

ముందుగా తేరుకున్న ఆనంద్ "ఎందుకు బాబూ! నీకు ఇంత ఖర్చు అంత దూరం నుంచి వచ్చావు. వచ్చినప్పటి నుంచి పనులు పెట్టుకొని తిరుగుతున్నావు. అయినా మీ అమ్మకి ఇవేమీ అక్కర్లేదురా! ఈ వయసులో ఈ డైమండ్స్, కార్లు, షికార్లు కొత్త హంగులు కాదురా కావాల్సింది. ఒక్కగానొక్క కొడుకువి నువ్వు ప్రయోజకుడివి అయ్యావు. లక్షణమైన కోడలు, ముద్దొచ్చే మనవడు. మా కింతకంటే కావాల్సిందేముంది? మేమూ రిటైరయిపోయాం. జీవిత పయనంలో అలసిపోయాం రా! నీ దగ్గరికి వచ్చి శేష జీవితం గడిపేయాలని మీ అమ్మ కోరిక. నా కోరికా అదే! ఏమంటావు?" అని కొడుకువైపు చూశారాయన.

ధీరజ్ నిర్లిప్తంగా వుండిపోయాడు. రాణి భర్త భుజం పట్టుకుని "మాట్లాడరేమండీ! మీ అమ్మ, నాన్న అంత ప్రేమగా మన దగ్గరికి వచ్చి ఉండిపోతామంటుంటే ఎగిరి గంతులేసి ఆహ్వానించాల్సింది పోయి అలా ముభావంగా ఉండిపోయారేం. నేనేమైనా వద్దంటానని అనుకుంటున్నారా! మనకి వాళ్ళు తప్ప ఎవరున్నారండి? నాకు వాళ్ళు మనతో ఉండడం చాలా ఇష్టమండీ. అసలు నేనే అత్తగార్ని మన దగ్గరికి వచ్చేయమని అడిగాను తెల్సిందా? బంటి కూడా 4 రోజుల నుంచి అత్తయ్య గారికి, మావయ్య గారికి బాగా మాలిమి అయిపోయాడు. మీ నాన్నగారి కథలతో, అత్తగారి పిండివంటలతో అమ్మ, నాన్నల్ని మర్చిపోయాడు తెల్సా! ప్లీజ్ అండీ, వాళ్ళని మనతో తీసుకెళదాం' అంటూ గలగల మాట్లాడేస్తుంది రాణి.

"రాణీ! నువ్వు కాస్త నోర్మూసుకుంటావా నాకు తెల్సు ఏం చేయాలో, అవతలకి వెళ్ళు నన్ను విసిగించకుండా" అని గట్టిగా విదిలించుకున్నాడు ధీరజ్.

రాణి చిన్న మొహం చేసుకొని బెడ్ రూంలోకి వెళ్ళిపోయింది. పార్వతికి, ఆనందరావుకి ఏదో కొంచెం కొంచెం అర్థమైనట్లు అన్పించింది కాని పూర్తిగా తెలియడం లేదు.

"ఏరా ధీరూ! పాపం రాణిని అంతలా కసిరేసావు, నాకు అయినా సమాధానం చెప్తావా? లేదా" అని పార్వతి చిరుకోపంతో అడిగింది.

"దేనికి? నాన్నగారు అడిగిన దానికేనా! అదే అయితే నా నిర్ణయం కూడా వినండి. మీకు కావాల్సిన సౌకర్యాలన్నీ ఇక్కడే ఇండియాలో, మీ ఇంట్లోనే ఏర్పాటు చేస్తాను. ఎన్ని డాలర్లు కావాలంటే అన్ని డాలర్లు ప్రతినెలా పంపుతాను. మీరు గతంలో ఏయే

సౌకర్యాలు, వస్తువులు కావాలనుకొని పొందలేకపోయారో అవన్నీ మీకు అందజేస్తాను. దేనికీ లోటు చేయను. కానీ...."ఆర్ద్రోక్తిలో ఆగిపోయాడు ధీరజ్.

"ఆపేశావేం? చెప్పరా! మీరు మాత్రం మాతో అమెరికా రావద్దు, నేను ఈ ముసలివాళ్ళని భరించలేను అంటావా? చెప్పరా!" ఆవేశంగా అరిచారు ఆనందరావు గారు. "అయినా మేం ముసలి వాళ్ళం కదా, మేము నీతో వస్తే నీ డిగ్నిటీకి భంగం. ఎంతయినా తల్లిదండ్రులం కదా. నువ్వు ఆ విషయాన్ని మర్చి పోయావని తెలిక పిచ్చి మొహంది నీ తల్లి బాబు దగ్గరికి వెళ్దామండీ అని ఆశపడింది. ఇప్పుడు తెల్సిందా పార్వతీ అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు కాదే! నీ ఆస్తులు, ఐశ్వర్యాలు కోసం మేం మొహం వాచిపోలేదురా! కన్న కడుపు తీపితో నీ ప్రేమాభిమానాల కోసం పాకులాడుతున్నాం రా!..." అన్నాడు ఆనందరావు.

"ఆపండి" అని ధీరజ్ గట్టిగా ఒక్క అరుపు అరవడంతో అందరూ ఉలిక్కిపడి భయంగా ధీరజ్ వైపు చూసారు.

"ఏంటీ కడుపు తీపా? ప్రేమ, అభిమానం? మీకా? ఎంత బాగా నటిస్తున్నారు నాన్నా! జీసస్ ఏం చెప్పారు 'ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును.' ఏనాడైనా నన్ను ప్రేమగా లాలించారా? నేను పుట్టిన నెలరోజులకే అమ్మ ఉద్యోగమే ముఖ్యం అనుకొని కేర్ సెంటర్ లో నన్ను పడేసి తన దారిన తాను ఉద్యోగానికి వెళ్ళిపోయింది. కొంచెం పెద్దయ్యాక ఆయాల అజమాయిషీ! నువ్వు, నీ ఉద్యోగం, ఓవర్ టైములతో నీ దారి నీదిగా ఉండేవాడివి. ఎప్పుడు క్రమశిక్షణ, మంచి అలవాట్లు అంటూ రెసిడెన్షియల్ స్కూల్ లోను, హాస్టల్ లోనూ నా బాల్యం, యౌవనం గడచిపోయాయి. సెలవులకి ఇంటికి వచ్చినా కూడా మీ క్యాంపులు, మీ హడావిడులే గాని నన్నేనాడయినా దగ్గరకు తీసుకొని, ఆప్యాయంగా లాలించారా? ఎన్నో రాత్రులు అమ్మా, నాన్నా అని ఏడుస్తూ నిద్రలేకుండా గడిపాను తెలుసా. నాన్న చల్లని చూపుకోసం, అమ్మ వెచ్చని స్పర్శ కోసం నామనసెంత పరితపించిపోయిందో మీకేం తెల్సు? కష్టం సుఖం చెప్పుకోవడానికి, తోబుట్టువులు లేరు. ఒంటరి జీవితం. మీ ఇద్దరూ డబ్బు సంపాదనే లక్ష్యంగా నిర్దేశించారే కాని నేనేమైపోతున్నానో, నాకేం కావాలో ఎప్పుడైనా గమనించారా? హాస్టల్ లో అందరూ సెలవులకి ఇంటికి వెళ్ళేవారు. నేను మాత్రం ఒంటరిగా..." కళ్ళ నీళ్ళు తిరిగిపోతుంటే మాట పూర్తి చేయలేకపోయాడు ధీరజ్. కాసేపటికి తేరుకుని "అందుకే, నాకు బాల్యం అన్నా, తల్లిదండ్రులు అన్నా ఇష్టం లేదు. నేను అనే ప్రాణిని భూమ్మీదకి రాకపోతే ఎంత బాగుండేది? నాకెవరున్నారు? మీ సుఖాలు చూసుకున్నారే గాని నాగురించి ఆలోచించారా? పోటీతత్వంతో నన్ను పెంచారు. మెడిసిన్ చదవడం ఇష్టమైతే మీ కోరిక మేరకు ఇంజనీరింగ్ లో చేర్పించారు. పెళ్ళి మీకు నచ్చిన అమ్మాయితోనే చేసారు. అన్నీ చివరికి అమెరికా కూడా మీకు నచ్చినట్లుగా పంపారు. కొడుకుగా నాకేం కావాలో, నా ఇష్టాయిష్టాలేమిటో, ఏనాడయినా ఆలోచించారా? డబ్బుతో దేన్నయినా కొనగలం, సాధించగలం అనే అనుకున్నారు గాని ప్రేమ, ఆప్యాయతల్ని మర్చిపోయి ఈ రోజు మీరు వాటి గురించి మాట్లాడడం చాలా చాలా విడ్డూరంగా వుంది. మన మధ్య ఉన్నది రక్త సంబంధం, ప్రేమానుబంధం కాదు డబ్బు సంబంధం మీరు నాకు ఎంతో ఖర్చు పెట్టారు. ఇంతవాణ్ణి చేసారు అనుకుంటున్నారు కదా ఋణం తీర్చుకోవడానికే ఇండియా వచ్చాను. మీక్కావలసిన సౌకర్యాలు అన్నీ డబ్బుతోనే అమర్చి తిరిగి అమెరికా వెళ్ళిపోతున్నాను. నా పిల్లాడ్ని మాత్రం మీరు నన్ను పెంచినట్లు పెంచను. నాలా వాడికి బాల్యం చేదు జ్ఞాపకం కాకూడదు. నా భార్యని అందుకే ఉద్యోగం చేయనివ్వను వాడు పెద్దయి నాలా ఫీలవకూడదు. నేను పొందలేని ప్రేమాభిమానాల్ని వాడు పూర్తిగా పొందేలా చేస్తాను, చూస్తాను అన్నాడు" ఆవేశంగా!

"అయిందా, ఇంకా ఏమైనా ఉందా?" శాంతంగా అడిగారు ఆనందరావు. "ఏంటి? మాకు నీ మీద ప్రేమ, వాత్సల్యం లేవా? అవి లేకుండానే నువ్వు ఇంత వాడివయ్యావా? నీకసలు ఏం తెల్సని మాట్లాడుతున్నావురా?" కొంచెం ఆగి తిరిగి మొదలు పెట్టారు.

"మా ఇద్దరిదీ వర్ణాంతర వివాహం. అటు వాళ్లని, ఇటు వాళ్లని కాదని చేసుకున్న పెళ్ళి, అందరి శాపనార్థాల మధ్య మొదలుపెట్టిన కాపురం. నాదా ప్రయివేట్ ఉద్యోగం. ఇద్దరం కల్సి ఉద్యోగాలకి వెళితే గాని నమ్మకంగా, ధైర్యంగా ఉండలేని పరిస్థితి. నువ్వు కడుపులో పడిన వేళా విశేషం మీ అమ్మకి ఉద్యోగం దొరికింది. మెటర్నిటీ లీవ్ నెల కంటే ఇవ్వలేదు ప్రయివేట్ స్కూల్ కావటంతో ఉద్యోగం వదులుకోలేదు. ఎందుకంటే నీ భవిష్యత్ కి మా ప్రేమ ఒక్కటే సరిపోదు కదా డబ్బు కూడా వుండాలి. నువ్వు పుట్టిన నెల రోజులకే మీ అమ్మ నిన్ను వదిలి వెళ్ళలేక ఎంత ఏడుస్తూ ఉద్యోగానికి వెళ్లిందో నీకేం తెల్సురా? కేర్ సెంటర్ స్కూల్లోనే వుండడంతో గంటగంటకీ నీ దగ్గరికి వెళ్ళి వచ్చేది! మాకు వెనకాల ఆస్తులు లేవు! బాబూ మా పెద్దల తిట్లు తప్ప! మమ్మల్ని కాదని చేసుకున్నారు. ఎలా ఉంటారో, ఎలా పైకి వస్తారో చూద్దాం అని సవాళ్ళు విసిరేవారే కాని సాయం చేద్దామనే సహృదయులు మాకెవరూ లేరు. మేము ఆరోజు క్రమశిక్షణతో నిన్ను పెంచబట్టేరా నువ్వీ స్థితికి రాగల్గినది. మా అదుపాజ్ఞలు, కట్టుబాట్లు చూసావే గాని వాటి వెనకాల మా ప్రేమ, ఆత్మీయతని అర్థం చేసుకోలేకపోయావు. ఉన్నది ఒక్క నలుసు! ఎంతో గొప్పవాణ్ణి చేయాలి. నవ్విన నాప చేనే పండింది అని అనుకొనేటట్లుగా నిన్ను పెంచాలి అన్నదే మా తాపత్రయం. ఈరోజు నీకు ఉన్న స్థాయి, హోదా ఆ రోజు నాకుంటే మీ అమ్మ, ఉద్యోగం చేసేదే కాదు. నేనూ నీలాగ గొప్ప కబుర్లు ఎంతో బాగా చెప్పేవాణ్ణి. హాస్టల్ లో ఎందుకుంచామనేగా నీ ప్రశ్న? ఎప్పుడూ క్యాంపులని నేను, అమ్మ స్కూల్లో ప్రయివేట్లని వుండిపోవడం వల్ల నీకు సమయం ఇవ్వలేక పోతున్నామే దగ్గర ఉండి చదివించలేకపోతున్నామే అన్న బాధతో హాస్టల్ లో అయితే అందరితో కలిసి మెలిసి ఒంటరితనం పోగొట్టుకొని, బాగా చదువుకుంటావని పెట్టాంరా! 9వ క్లాసులో ఉన్నప్పుడు ఒక్కసారేనిన్ను సెలవులకి ఇంటికి తీసుకురాలేదు. ఎందుకో తెల్సా మీ అమ్మకి మేజర్ ఆపరేషన్ అయ్యింది. నువ్వు గాబరా పడతావని ఆ సంవత్సరం సెలవులకి నిన్ను తీసుకురాలేదు. అంత మాత్రానికే అమ్మ నాన్నకి ప్రేమ లేదు డబ్బే ప్రధానం అని ఎంత తేలిగ్గా అనేశావు ధీరూ మేము పోటీ తత్త్వంలో కాదురా నిన్ను చదివించింది. నువ్వు దేనికీ లోటు పడకూడదు. అమ్మ, నాన్న నాకు ఏమీ ఇవ్వలేదు. అందరిలా ట్యూషన్స్ పెట్టించలేదు. వాళ్ళు బాగా ఖర్చు పెట్టి వుంటే నేనివాళ ఇంకా ఎంతో గొప్పగా ఉండేవాణ్ణి అని కలలో కూడా అనుకోకూడదనే ఉద్దేశ్యంతోనే నిన్ను మా శక్తికి మించి చదివించాము. నీకు సైటు ప్రాబ్లం ఉండటంతో మెడిసిన్ కష్టపడలేవని ఇంజనీరింగ్ అయితే త్వరగా సెటిల్ అవడానికి అవకాశాలు ఎక్కువ అని నీ శ్రేయోభిలాషులుగా ఆలోచించి అలా చదివించాంరా! మా సంపాదన అంతా మేం జల్సాలు చేసుకోవడానికి కాదు నాన్నా, నీకోసం నీ భవిష్యత్ కోసం! నువ్వు చిన్నప్పుడు చదువులో చాలా వెనుకబడి వుండేవాడివి. మేం కూడా వీడు ఏదో ఒకటి చదివితే చాల్లే అని ఏ డిగ్రీయో చేయించి, నాలా క్లర్క్ ఉద్యోగం ఎక్కడో వేయించేస్తే ఎవరు అడుగుతారు? కాని నా పిల్లవాడు నా కంటే ఉన్నతంగా ఉండాలి. భవిష్యత్తులో ఎప్పుడూ. అయ్యో! మా వాళ్ళు నన్ను ఇలా తయారుచేశారేంటి అని ఎట్టి పరిస్థితుల్లో నువ్వు ఫీలవకూడదు అని మా తాపత్రయమంత నీ గురించేరా! మా స్థాయికి మించి అప్పులు చేసి నిన్ను ఫారిన్ కూడా మా ఖర్చుతో పంపించాము. తర్వాత నువ్వే బాగా సంపాదిస్తున్నావు. ఇదేదో ఉద్ధరింపుగా మేము అనుకోవడం లేదు. ఇది మా బాధ్యత. మాదే కాదు ప్రతి తల్లిదండ్రుల కనీస ఖచ్చితమైన బాధ్యత. పిల్లల్ని కనగానే కాదు వాళ్ళని సరైన నడవడికతో పెంచి, చక్కని పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత. మీ నుంచి మేము ఆశించినది డబ్బు కాదు నాన్నా ప్రేమ. కాని బాబూ! నీరు పల్లమెరుగు అన్నట్లు ప్రతి తల్లి తండ్రి తమ పిల్లల శ్రేయస్సునే కోరుతారు కాని, పిల్లలు మాత్రం, పెరిగి పెద్దయ్యి వాళ్ళ భార్య పిల్లల కోసం ఆలోచిస్తారే కాని కనిపెంచిన తల్లిదండ్రుల

గురించి ఆలోచించరు. కొంతమంది పిల్లలు అమ్మా నాన్న మాకేం ఇస్తారు? ఆస్తా, పాస్తా, మంచి చదువా? అంటూ ఎంతసేపు తల్లిదండ్రుల నుంచి మనం ఎంత పిల్చుకుంటున్నామా అనే ఆలోచిస్తారే గాని తల్లిదండ్రులకి మనం ఏం చేస్తున్నామని ఆలోచించరు. ఇది మీ తరం తప్పుకాదు. ఇదొక జీవన స్రవంతి. మేము మా తల్లిదండ్రుల కంటే నీకు ప్రాధాన్యత ఇచ్చినట్లే నువ్వూ నీ కొడుకు, కుటుంబం కోసం తాపత్రయ పడుతున్నావు. మంచిది బాబూ! నువ్వు ఆనందంగా నూరేళ్ళూ వర్ధిల్లడమే నాక్కావాలి. మేము ఎక్కడున్నా నీ సంతోషాన్ని, సుఖాన్నే కోరుకుంటాము. కాని ఎప్పుడూ కలలో కూడా అమ్మ నాన్నలకి నీ మీద ప్రేమ లేదు అని అనుకోకు. నువ్వే మా ప్రాణం, సర్వస్వం! ఈ బంధాలు, ఆత్మీయతలు చాలా సున్నితమైనవి ధీరూ! డబ్బుతో కొనలేనివి, వెలలేనివి. ఇంతసేపూ, నిన్నేదో మభ్య పెట్టాలనో, లేదా నీ దగ్గర ఉండడానికి ఏవో మాయ మాటలు చెప్తున్నాననో పొరపాటున కూడా అనుకోకు. సమయం వచ్చింది కాబట్టి ఇంత వివరంగా చెప్పాల్సి వచ్చింది. ఆ పైన ఏమనుకున్నా నీ ఇష్టం" అని భారంగా విశ్వసించి లేచారు ఆనందరావు గారు.

అప్పటికే సిగ్గుతో, గిల్టీ ఫీలింగ్ తో కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోతున్న హైటెక్కు కొడుకు ధీరజ్ తండ్రిని సమీపించి "నాన్నగారూ! నేను ఎంత అవివేకినో, అజ్ఞానినో నాకు ఇప్పుడే తెలిసింది. నేను చాలా మూర్ఖంగా ఆలోచించి అమ్మని, మిమ్మల్ని నా మాటలతో, ప్రవర్తనతో చాలా బాధపెట్టాను. మీరు అహరహము నా అభ్యున్నతి కోసం ఎంతో పాటు పడ్డారు. ఇప్పుడు కొడుకుగా నా కర్తవ్యం నిర్వర్తించే అవకాశం నాకు కల్గచేయండి!" నన్ను క్షమించి మాతో పాటు మీరూ అమెరికా బయలుదేరండి. అంటూ తల్లిదండ్రుల పాదాల మీద వాలిపోయాడు.




అమరావతి అపార్ట్ మెంట్స్ ఆరోజు సందడితో కళ సంతరించుకుంది. అందులోని ఫ్లాట్స్ వాళ్ళు.. చుట్టు పక్కల ఫ్లాట్స్ లోని వాళ్ళందరూ అందంగా ముస్తాబై అపార్ట్ మెంట్ పైకి చేరుకున్నారు. కొద్ది సేపటి తర్వాత టాం టాం టివి టీం అక్కడకి చేరుకుంది. ఆ ఏరియాలోని అన్ని అపార్ట్ మెంట్లలో ఆ అపార్ట్ మెంట్ 'మనసులోది కక్కు.. బహుమతి పట్టు' కార్యక్రమానికి ఎంపికయింది. దానికి మిగతా అపార్ట్ మెంట్ల వాళ్ళు కుళ్ళిపోతున్నారు కూడాను.

స్వీట్లు హాట్లు కతకడం.. తాపీగా టీ లు తాగడం అయ్యాక.. కెమెరాలు.. రిఫ్లెక్టర్లు అరెంజ్ చేసుకుని..

"అమరావతి అపార్ట్ మెంట్లో మన కార్ క్రమం 'మనసులోది కక్కు..బహుమతి పట్టు' కి స్వాగటం సుస్వాగటం..అందరూ ఎంతో ఆషక్తిగా.. ఉత్సాహంగా పార్టిసిపేట్ చెయ్యడానికి రెడీగా వున్నట్టు టెలుస్తోంది. మరి ప్రారంభిద్దామా?" అంది యాంకర్ ఇంగ్లీష్ ని తెలుగుని తన నోటి మిక్సీలో వేసి బయటకి మాటల రూపంలో విడుస్తూ..

"ఓ" అన్నారు ఒకరిద్దరు.

"నాకు విన్పడ్డం లేదు" అంది.

"ఓ" ఈసారి అందరూ గట్టిగా ముక్తకంఠంతో అన్నారు.

"సరే అయితే.. ఈ అంకుల్ పెద్దపొట్టలో..చిన్నకళ్ళలో.. అచ్చం మొన్న మనం జరుపుకున్న వినాయక చవితి వినాయకుడిలా వున్నాడు. ఈయన చేత ఓ పాట పాడుతూ స్టెప్పులేద్దామా?"

యాభైయేళ్ళ వయసున్న ఆయన అందరిమధ్యా సిగ్గుతో అత్తిపత్తిలా బిక్కచచ్చిపోయాడు.

"మీరు పాడాలి.. ఆడాలి.." అని అరచి "మీరందరూ కూడా ఆయన్ని ప్రెషర్ చేయండి" అని అందరిముందు మైకు పెట్టింది.

అందరూ "పాడాలి..ఆడాలి" అని కోరస్ గా అరిచారు.

ఆయన "తెలుగు వీర లేవరా.." పాటందుకున్నాడు "అబ్బే అది కాదండి.. ఆరేసుకోబోయి పారేసుకున్నాను పాట పాడుతూ ఆడాలి.. అన్నట్టు అమ్మమ్మ వుంటే మజాగా బాగుంటుంది కదూ.." అని సిగ్గులమొగ్గవుతున్నావిడ్ని లాక్కొచ్చి ఆయన పక్కన నిలబెట్టింది. ఇహ చేసేందేంలేక వాళ్ళిద్దరూ రెండు నిమిషాలు ఆడి పాడి దూరంగా వెళ్ళిపోయారు.

"అదండీ.. బాగుంది కదా.. ఇహ మనం ‘మనసులోది కక్కు.. బహుమతి పట్టు’ ప్రారంభిద్దామా? అంది"

"ఆ" అన్నారందరూ..

పాతికేళ్ళున్న ఒకామె దగ్గరకెళ్ళి "మీ అత్తగారి గురించి మీ అభిప్రాయం?" అంది.

"అమ్మలా చూసుకుంటుంది.."

"ఈ కార్యక్రమం 'మనసులోది కక్కు.. బహుమతి పట్టు' నువ్వు నిజాలే కక్కాలి అప్పుడే బహుమతి" అంది.

"అమ్మ పెంపకంలో అల్లారు ముద్దుగా పెరిగిన నేను పెళ్ళి పేరుతో ఈ అత్త రాక్షసి చేతిలో పడ్డాను.. ఇహ అప్పటినుండీ నరకం.. భూలోక నరకం" ముక్కుచీదుడులో ఏడుపు మిళితంచేస్తూ అంది.

"ఏంటే నోటికొచ్చిందల్లా వాగుతున్నావు? నువ్వు మాత్రం నా కొడుకుని అమాయకుడ్ని చేసుకుని కొంగుకి కట్టుకుని నన్ను నానా హింసలూ పెట్టట్లా.."

"యస్..అదీ ఊపు.. ఎవరు ఎక్కువ కక్కితే వాళ్ళకి బహుమతి.. కానీయండి.. ఊ రెచ్చిపోండి"

"అబ్బో నీ కొడుకు.. ఎంత సేపూ తల్లి తల్లీ అంటాడు.. కొంగుచాటున పెంచావు.. నా కొంగున కట్టుకునుంటే.. ఈ పాటికి వేరుపడే వాళ్ళం.."

"నువ్వెన్నిప్రయత్నాలు చెయ్యలేదే మహా తల్లీ.." అని కోడలి మీదకి లంఘించి జుట్టు పట్టుకుంది.

"నిన్నొదుల్తానటే.." అని కోడలు కూడా అత్త జుట్టు పట్టుకుంది.

ఇద్దరూ కూడా రక్తాలొచ్చేటట్టు కొట్టుకుంటుంటే యాంకరు మైకు మరొకాయన ముందు పెట్టి "మీరు ఎవరి మీదనన్నా కోపం కక్కాలనుకుంటున్నారా?"

"నాన్నా మీ ఆఫీసరుని ఎప్పుడూ తిడుతూంటావు కదా" అని అతడి పుత్రరత్నం ఉప్పందించాడు.

"మీ ఆఫీసరుగారంటే మీకు కోపమా..అయితే కక్కండి ఇది మీకు మంచి అవకాశం.. పైగా బహుమతి కూడా రావచ్చు.." అంది యాంకర్ ఎరకి పడిన చేపలావున్న అతడ్ని చూస్తూ.

భార్య కూడా బహుమతి కోసం 'రెచ్చిపోండి' అని సైగ చెయ్యడంతో-

'ఆ(.. ఈ కార్యక్రమం ఎప్పుడో టెలికాస్ట్ అవుతుంది. మాఆఫీసరు ఈ కార్యక్రమం చూడొచ్చాడా..ఏమిటి?' అని మనసులో అనుకుని - "మా ఆఫీసరు.. అసలు మనిషికాడండి.. దుర్మార్గుడు. సెలవు మాట అటుంచితే కనీసం పదినిముషాలు పర్మీషన్ అడిగితే చాలు ఫయిరైపోతాడు. వాడు మాత్రం సెలవులు తీసుకుని పెళ్ళాం పిల్లలతో ఊటీ, కొడైకెనాలు తిరగొచ్చు.హు(" అని బాధగా నిట్టూర్చాడు.

మైకు ఇంకొకామె ముందు పెట్టి "ఇప్పుడు మీరు చెప్పండి మీ కోపం ఎలా కక్కుతారో"

"మా పనిమనిషి ఉత్త చాడీలది.. అందరి మీదా ఉన్నవి లేనివి చెబుతుంది.."

"అబ్బో.. ఊకోవమ్మా.. ఆ పొరుగింటావిడ ఏం కొంది.. ఈ పక్కింటావిడ ఇంట్లో అడావుడేంటని రోజూ నువ్వు అడగవూ.."

'ఇదిక్కడే చచ్చిందా.. అందరిలో పరువుపోతోంది.. అనవసరంగా దీని నోట్లో నోరు పెట్టా'ననుకుని.. "చాల్లేవే..పెద్ద చెప్పొచ్చావు.." అని దాని మీద కెళ్ళింది. అదూరుకుంటుందా సేం టు సేమ్.

మైక్ ఒక పిల్లాడి ముందు పెట్టి "చిన్నా మరి నువ్వు ఎలా కక్కుతావు?"

"మా టీచరుకి మమ్మల్ని బాదడం తప్ప ఏమీ రాదు. మార్కులు తక్కువొస్తేనేమో అమ్మా నాన్న నన్ను బాదుతారు. అసలు ఈ టీచర్లు..." వాడో పదినిముషాలు రెచ్చిపోయాడు.

"మరి నువ్వు ఎలా కక్కాలనుకుంటున్నావు?" అక్కడున్న పదహారేళ్ళ అమ్మాయిముందు పెట్టింది మైకు.

"ఆ రాం గాడు నన్ను ప్రేమిస్తున్నానని వెంటబడితే పోన్లే కదా అని ప్రేమించాను.. వాడిప్పుడు ఆ శ్యామల వెంటబడుతున్నాడు.. చిత్తకార్తె కుక్క"

"కుక్కేంటే కుక్క..      నువ్వుమాత్రం ఆ రాజా గాడికి లవ్ లెటర్ రాయలా..మరి నిన్నేమనాలే"

"పోరా"

"పోవే"

అలా అలా మైకు అందరి ముందుకూ వచ్చింది. కెమెరా ముందు ఒళ్ళు తెలియకుండా రెచ్చిపోయారందరూ.

"ఈరోజు ఈ కార్యక్రమం సక్సెస్ అయింది. నాకు తెలుసు మీరందరూ ఎవరికి బహుమతి వచ్చిందా అని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని. చెప్పేస్తున్నాను.. చెప్పేస్తున్నాను.. మొదటి గిఫ్ట్ అత్తకి కోడలికి ట్రెడిషనల్ బ్రదర్స్ నుండి రొట్టెల సాన అప్పడాల కర్ర.. రెండో బహుమతి ఈ పిల్లాడికి తుత్తూ స్టేషనరీస్ నుండి కంపాస్ బాక్స్.. ఇహ మూడో బహుమతి ఆరేసుకోబోయి పాడిన తాతకి అమ్మమ్మకి ఓల్డ్ ఈజ్ గోల్డ్ వారి తరఫు నుండి యాభై రూపాయల స్పెషల్ గిఫ్ట్ హ్యాంపర్." అంది యాంకర్ వయ్యారాలు పోతూ.

బహుమతులు తీసుకోవడానికి అక్కడెవరూ లేరు. వాళ్ళ ఇళ్లల్లోంచి మాత్రం పెద్ద పెద్ద అరుపులు కేకలు.. శబ్దాలు వినిపిస్తున్నాయి.

మరుసటిరోజు ఆ ఏరియాని కల్లోల ప్రాంతంగా ప్రకటించి అక్కడ శాంతి కోసం పారామిలిటరీ దళాలని మోహరించారు. ఆఫీసర్ని అవాకులు చెవాకులు పేలిన ఆ ఉద్యోగి ప్రస్తుతం కొన్ని వేల ఫయిల్ల మధ్య వరదల్లో చిక్కుకున్న బాధితుడిలా

విలవిల్లాడుతున్నాడు.

టీచరు గురించి సొల్లు వాగుడు వాగిన ఆ పిల్లాడు రోజూ ఆ టీచరుకి గోడకుర్చీ అవుతున్నాడు. 'ఆరేసుకోబోయి' పాడినాయన వెళుతుంటే, ఆయన వెనకాల "ఈనాడే మనకీ పండగా.. ముసలాడికి దసరా పండగ" అని రాగాలు తీస్తున్నారు.

ఇవేవి తెలియని అమాయక ప్రేక్షక జనం టీవీల ముందు కూర్చుని ఆ కార్యక్రమం చూస్తూ వెటకారంగా నవ్వుకుంటున్నారు.




కారు గ్యారేజిలో పార్క్ చేసి కీ చెయిన్ సుతారంగా తిప్పుతూ కాలింగ్ బెల్ కొట్టాడు అభినవ్. సునీల వస్తున్నట్లు అలికిడేమిలేదు.

అనుమానంగా తలుపుతోసాడు. తెరుచుకుంది. అప్పటికే కారు వచ్చిన శబ్దంవిని గబగబా తలుపు తీసి సునీల మళ్లీ లోపలకు పరుగెత్తింది.

"ఓ! డ్రెసింగ్ టేబుల్ దగ్గర నగిషీలు ఇంకా పూర్తి కాలేదా? ఇలా అయితే రిసెప్షనుకు మనమే చివరి అతిథులవుతాం."

"నేనున్నది డైనింగ్ టేబుల్ దగ్గర. నా నగిషీలకేమొచ్చెగాని జ్యూస్ తాగి మీరు త్వరగా తయారవండి."

"నాదెంతసేపు? పదినిమిషాలే!"

"సరే... సరే, మీరు రెడీ అయేసరికి నేను కారులో ఉంటాను. సరేనా!" నవ్వుతూ తనను తాను మరోసారి అద్దంలో చూసుకుంది. మంగళసూత్రంలో అల్లుకుపోయినట్లున్న

నల్లపూసల గొలుసు, ఎడమచేతికి వాచీ, కుడిచేతికి ఒకగాజు. చిన్న కమ్మలు నల్ల పూసలవి. తృప్తిగా తలపంకించింది.

తయారై కారు దగ్గరకు వచ్చిన అభినవ్ భార్యవైపు ఆశ్చర్యంగా చూసాడు.

"ఎప్పుడో పుట్టబోయే పాపాయికి నీ నగలు దాచిపెట్టావా? రిసెప్షనుకు చక్కగా వేసుకోవచ్చుగా! నువ్విలా వస్తే నన్నుకోగలరు పిసినారి భర్త నగలేమి కొనివ్వడంలేదేమోనని!"

"నిజమే కదా!" కిసుక్కున నవ్వింది సునీల.

"ఆ...!" నోరు తెరిచాడు అభినవ్.

"లేకపోతే ఏమిటండీ నేనెప్పుడైనా నగలు అడిగానా? అయినా నాకిలా ఉండటమే ఇష్టం."

"కాని పదిమందిలో..."

"ఏమవుతుంది? ఖాళీ కుండలనుకుంటారు. మనకేం నష్టం."

"నేను నిన్ను ఒప్పించనులేను, నొప్పించనులేను. పద."

కారు రిసెప్షన్ హాల్ చేరుకుంది. అభినవ్ కారు పార్క్ చేసి వచ్చేదాకా సునీల ఓ వారగా నిలుచునే ఉంది.

"ఏంటలా దూరంగా నిలుచున్నావు? మనం వచ్చింది అమ్మాయిని, అబ్బాయిని ఆశీర్వదించడానికే కాదు ఇక్కడకు వచ్చిన మన పరిచయస్థులను పలకరించుకోవడానికి, కొత్త పరిచయాలు ఏర్పరచుకోడానికి, కబుర్లు చెప్పుకోవడానికి కదా!"

"నేను కాదన్నానా పదండి... మీతో కలిసి వెళ్దామని ఆగాను."

"ఓ.కే! మరి చూడు తెలిసినవారు కనబడతారేమో... ఉరుకులు పరుగుల జీవితంలో పలకరింపులు లేవు. మాటల కలబోతలు లేవు. కనీసం ఇలాంటి చోటునన్నా నలుగురితో కలిసే అవకాశం వస్తుంది."

బెరుకు బెరుగ్గా నిలుచున్న భార్యను చెయ్యి పట్టుకుని లోపలకు నడిచాడు.

తెలిసినవారు ఉండకపోతారా అని చుట్టూ పరికించి చూసాడు అభినవ్.

హాలుకన్నా బయట ఆవరణలోనే చేసిన అలంకరణ మరింత ఆకర్షణీయంగా ఉంది. వృక్షాలపై పరచుకుంటున్న విద్యుద్దీపాల సప్తవర్ణాలు, కృత్రిమ జలపాతాలు, కుటుంబమంతటికీ సరిపోయేలా కుర్చీలు వేసిన రౌండ్ టేబిళ్ళు. వాటిపై అమర్చిన పూల సువాసనలు గృహస్థు హోదాను వెదజల్లుతున్నాయి. కొందరు సూప్ తాగుతున్నారు. కొందరు సలాడ్స్ ఆస్వాదిస్తున్నారు. పిల్లలు బెలూన్లను కట్టినచోట ఉంచకుండా లాగుతూ, టప్ మనిపిస్తూ నవ్వులు పంచుతున్నారు. వారు అందంగా అలంకరించిన బెలూన్లతో అల్లరి చెయ్యడం ఇబ్బందిగా ఉన్నా సరదాగాను ఉంది. పిల్లలకదో ఆటవిడుపు అనుకున్నాడు అభినవ్.

సూప్ బౌల్ పట్టుకుని తనను గమనించకుండా వెళ్తున్న రాంబాబుని చెయ్యి పట్టుకుని ఆపాడు అభినవ్.

"చాలా సేపయిందా వచ్చి... కనబడలేదే..." అడిగాడు రాంబాబు.

"లేదురా... పది నిమిషాలయింది వచ్చి. స్టేజి మీదకు పెళ్లి జంట ఇంకా రాలేదే?" నవ్వుతూ అడిగాడు అభినవ్.

"ఆ పనిమీదే ఉంది మా ఆవిడ. చీర కట్టించడం, నగల అలంకరణ అయిందో లేదో!"

"అంతదాకా అబ్బాయికి నిరీక్షణ తప్పదు కదా!" అభినవ్ మాట పూర్తయేలోగానే, "అదిగో వస్తున్నట్టుంది." భార్య వస్తున్న వైపు చూసాడు రాంబాబు.

సునీల, అభినవ్ కుతూహలంగా అటు తిరిగి చూసారు.

అలంకరించుకున్న నగలు దూరానికే కనబడుతున్నాయి. అంటే తూకం, ధర రెండు బరువైనవే! బంగారు శిల్పమే నడచివస్తున్నట్లుంది. అప్రయత్నంగా అభినవ్ చూపులు భార్యవైపుకు మరిలాయి. 'ఇదొక ముసలమ్మ!' మనసులోనే విసుక్కున్నాడు.

అమ్మాయి, అబ్బాయి కూర్చున్నాక రాంబాబు భార్య సరిత స్టేజి దిగి నవ్వుతూ రాంబాబు దగ్గరకు వచ్చింది. 'రండి అక్షింతలు వేసొద్దాం' అంటూ.

"సరే అలాగే వెళ్దాం, కాని ముందు నా స్నేహితుడని పరిచయంచెయ్యనీ,

వీడు నా క్లాస్ మేట్, రూం మేట్ కూడా. అభి అంటాం అంతా. వారు అభినవ్ శ్రీమతి, పేరు..." ఆగాడు రాంబాబు.

పరిచయానంతరం నమస్కరిస్తూనే 'నా పేరు సునీల అండి' అంది సునీల నవ్వుతూ.

ప్రతినమస్కారం చేస్తూనే సరిత, సునీల చెవులు, చేతులు, కంఠం చూపులతోనే తడిమింది. ఆ చూపులకర్థం సునీలకు తెలుసు.

పరిచయాలు పెంచుకోవాలి కదా అనుకుంటూనే, దానికి నాందిగా,

"మీరెక్కడుంటారు?" అడిగింది సునీల.

దానికి సమాధానం వచ్చేలోగానే,

"హాయ్ సరితా! ఏమ్మా పెళ్లికూతరి అలంకరణ ఇంతసేపు చేసావా లేక నీ సింగారము జతకలిపావా? వజ్రాల లాకెట్ తిరగబడింది చూడు. (వజ్రాలేనా లేక... మనసులో సందేహం!)" సరిత లాకెట్ సారు చేసింది సరిత స్నేహితురాలు. చేతికి తూకం తగిలి అమ్మో అనుకుంది. నిజంగా వజ్రాలయితే నేటి ధరల్లో నాలుగు లకారాలే అనుకుంది.

"వాళ్లు వరంగల్ లో ఉంటారు. పెళ్లికి వచ్చారు." అభినవ్ భార్య ప్రశ్నకు బదులిచ్చాడు.

"పదండి ఆశీర్వదించి వద్దాం. మళ్లీ బఫేలో ఆలస్యమవుతుంది."

రాంబాబును, సరితను అనుసరించారు అందరూ. క్యూ పెరుగులోంది. అయితే ఎవరు క్యూ తప్పి వెళ్ళడం లేదు.

పరిశీలనకు కావలసిన సమయం దొరికింది. సునీల ముందు ఓ నలభై ఏళ్ల స్త్రీ నిలుచునుంది. రంగురాళ్ల గని వాళ్ల పుట్టిల్లనిపించేలా ఉంది. అందరికి తెలిసిన కెంపులు, పచ్చలుగా అనిపించడం లేదు. అయితే విద్యుద్దీపాల కాంతుల నడుమ మరింత మెరుపులు కురిపిస్తున్నాయి.

"ఎక్కడకొన్నారు ఈ నెక్లెస్ ను?" సరిత ఠక్కున అడిగింది. పలకరించాలంటేనే మొహమాట పడే సునీల సరిత మాటలకు ఉలిక్కిపడింది.

"ఇక్కడిది కాదు." ఆవిడ కళ్లలో కించిత్తు గర్వం.

"అవును అనుకున్నాను అప్పుడే, మరి..."

"బ్యాంకాక్ నుండి తెచ్చాను."

"మీరు వెళ్ళారా?"

"మరే. హాలిడే ట్రిప్ మాది. చక్కగా అవీ ఇవి చూసి షాపింగ్ గుర్తుగా మా అమ్మాయికి బ్రేస్ లెట్, నాకు ఈ నెక్లేస్ తెచ్చుకున్నాము."

"బ్రేస్ లెట్టా!" ఆసక్తిగా అడిగింది సరిత.

"అదిగో మా అమ్మాయి కూడా వేసుకునే వచ్చింది."

"రజనీ ఇలారా!" కూతురిని పిలిచింది ఆవిడ.

అందరు ఆసక్తిగా 'ఎవరా రజని' అన్నట్టు చూసారు.

తల్లి పిలుపుకు 'ఏమ్మా' అంటూ వచ్చింది సన్నగా మెరుపుతీగలా ఉన్న అమ్మాయి.

"ఈ ఆంటీకి ని బ్రేస్ లెట్ చూపించు."

"నేనందుకే వేసుకోనన్నాను. ఇలా ప్రదర్శనకు పెట్టావనే." అ అమ్మాయి అందంగా గొణిగింది.

"అరె నలుగురికి చూపకపోతే ఎలా తెలుస్తాయి డిజైన్లు."

క్యూలో ఉన్న ఆడవాళ్లు అందరు రజని చేతికున్న బ్రేస్ లెట్టే కాదు తల్లి మెడలోని నెక్లెస్ చూసారు. బ్యాంకాక్ ట్రిప్ ఖర్చుకు ఫలితం దొరికినంత సంబరంగా ఉంది ఆ నగలుకొన్న ఆవిడకు.

"మేము కూడా వెళ్ళాలనుకుంటున్నాము. మీ నంబరివ్వండి మీ నుండి షాపుల వివరాలు ముందుగానే తెలుసుకుంటాము." సరిత చనువుగా అడిగింది.

నంబర్ల మార్పిడి జరిగి పరిచయాలు జరుగుతున్నాయి.

'ఇందుకా పరిచయాలు పెంచుకోమన్నాడు అభి' అని మనసులోనే నవ్వుకుంది.

అందరికి పిల్లల బెలూన్ల ఆట కన్నా ఈ నగల సంబరం బాగుందనిపించింది.

పెళ్లికూతురుకు ఫోటోల ఫోజులను సూచిస్తోంది సరిత. మరి ఆల్బంలో కలకాలం అందంగా చూసుకోవాలంటే ఓర్పుగా నిలఫడి ఫోటోగ్రాఫరు చెప్పినట్టు వినాలి.

అటు ఇటు చూస్తున్న అభినవ్ కు క్యూ చివర వచ్చి నిలుచుంటున్న స్నేహితుడు వాసు కనిపించాడు.

"ఇటు... ఇటురా వాసు!" అభినవ్ గొంతు గుర్తుపట్టి శ్రీమతితో సహా అభినవ్ దగ్గరకు వచ్చాడు. తన భార్యను పరిచయం చేసాడు వాసు. భార్య పేరు రమణి అని, డిగ్రీ చదివిందని చెప్పాడు.

"మీరు కూడా నాలానే ఖాళీగా ఉంటారా..." కనీసం ఫోను పరిచయమైనా పెంపొందించుకోవచ్చనుకుంది సునీల.

"ఖాళీనా! అస్సలు లేదు... టైమే చాలదు."

ఎందుకన్నట్లు ఆశ్చర్యంగా చూసింది సునీల.

"ఇంట్లో చీరలు అమ్ముతుంది. నగలు కూడా!" వాసు గర్వంగా చెప్పాడు.

కష్టమరు దొరుకుతుందన్న ఆశ రమణిలో!

"ఏరా బంగారం కొనడం లేదా?"

వాసు గబుక్కున అలా అడిగేసరికి అభినవ్ కు ఇబ్బందిగా అనిపించింది.

"తగ్గితే కొందామని..." ఇదంతా నీవల్లే అన్నట్టు సునీల వంక చూస్తూ అన్నాడు.

అయ్యో రామ! బంగారం ఎంత తగ్గుతుంది? ఎప్పుడు తగ్గుతుంది? తగ్గినా మళ్ళీ పెరుగుతుంది. అయినా మనమేమి కిలోలు కొంటామా?

'ఎంత స్నేహితుడైనా ఇంతమందిలో ఇలా' సునీలకు ఇబ్బందిగా ఉంది.

కొత్త జంటను అక్షింతలు చల్లి ఆశీర్వదించారు అభినవ్, సునీల.

ఇక బఫేలో క్యూ మొదలయింది.

"హలో సునీలగారు అనుకోకుండా మీరేమిటి ఇలా! అమ్మాయి వైపా, అబ్బాయి వైపా?"

"ఇద్దరివైపును." నవ్వింది సునీల.

"ఎలా?"

"ఏముంది ఇద్దరు మా ఆఫీసులోని వారే!" అభినవ్ చెప్పాడు.

"వీరు నా ఫ్రెండ్స్ భార్గవి, అపర్ణ. వీరు మావారు." పరిచయం చేసింది సునీల.

సరిత, రాంబాబు కూడా వచ్చి చేరారు.

"అదేమిటి అభి అప్పుడే ఐస్ క్రీంలో కొచ్చారు. తిన్నారా అన్నీ! అంటే అన్నీ రుచి చూసారా?" రాంబాబు నవ్వుతూ అడిగాడు.

"అదే బఫేలలోని బలహీనత. అన్నీ రుచి చూసి పడేసే వైనం ఎక్కువవులోంది." సునీల మనసులోనున్నది చప్పున చెప్పడం... అభినవ్ ఆశ్చర్యంగా చూసాడు. మాటకు ముందు బంగారు తరువాత బంగారు అంటుంటే ఇబ్బంది పడిన సునీలకు మాట్లాడటానికి దొరికిన ఒకేఒక సామాజికాంశమది.

"ఎలా వచ్చారు మీరు?" భార్గవిని అడిగింది సునీల.

"ఆటోలో, ఏం నువ్వేమైనా డ్రాప్ చేస్తావా?"

"తప్పకుండా."

"సరే మాకిక భయపడాల్సిన పనిలేదు." సునీల చెయ్యి పట్టుకుంది భార్గవి.

ప్రక్కనే ఏదో చర్చ జరుగుతోంది. చెవి ఒగ్గకపోయినా వినపడాల్సినవి చెవులకు చేరుతూనే ఉన్నాయి.

'చెవిపోగుల కోసం చిన్నారులను ఎత్తుకు పోతున్నారు. దొరికి పోతామేమోనన్న భయంతో ఒక్కొక్కసారి చంపేస్తున్నారు. బంగారం ధర పెరిగాక సంపాదనకు సులభమార్గం ఇదే అనుకుంటున్నారు, నగలు కొన్నంతసేపు ఉండటంలేదు ఆనందం. వేసుకోవాలంటే భయం. ఇంట్లో దాయాలంటే భయం.' ఒక్కొక్కరు ఒకమాట చెప్తున్నారు.

"మరెందుకు కొనడం?" భార్గవి గుసగుసగా అంది.

"ష్! వింటారు, పదండిక వెళ్దాం." అంది సునీల.

స్నేహితురాళ్ళను వారి ఇండ్ల దగ్గర వదిలారు. సునీలను ఆలోచనలు వదిలిపెట్టడంలేదు.

పరిచయాలు పెరగడం కన్నా బంగారమే నేపథ్యంగా మాటలు కలబోసుకోవడం సునీలకు ఆశ్చర్యమనిపించింది.

"ఏంటలా నిలుచున్నావు? పద ఇంట్లోకి! ఇంతకీ ఎలా ఉంది ఫంక్షన్?"

"పలుకే బంగారమాయెనా!" నవ్వింది సునీల.

"ఎందుకు?"... అంటూ తను నవ్వేశాడు అభినవ్.